ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కడప
జిల్లా వార్తలు
5
శనివారం 27 ఏప్రిల్ 2024



దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆస్తులకు మాత్రమే సీఎం జగన్ వారసుడు.. ఆయన ఆశయాలను నెరవేర్చే రాజకీయ వారసుడు కాదని పీసీసీ చీఫ్ షర్మిలతో పాటు ఇతర కాంగ్రెస్ నేతలు ఆరోపణలు చేస్తుంటారు. వైఎస్ పాలనకు, జగన్ పాలనకు నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని ఆరోపిస్తుంటారు. జగన్ తీసుకుంటున్న నిర్ణయాలు చూస్తే విపక్షాల ఆరోపణలు నిజమేనని అనిపిస్తుంది. ఎందుకంటే దివంగత వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు జిల్లా ప్రజల చిరకాల వాంఛ అయిన కడప-బెంగళూరు రైలు మార్గాన్ని పట్టాలెక్కించారు. ఇక కడపలోనూ ఐటీ హబ్ ఏర్పాటు వైఎస్ కల. అందుకు తగ్గట్లుగానే భూమిని కేటాయించారు. ఇక తాగునీటి సమస్య తీర్చడం కోసం సోమశిల తాగునీటి పథకానికి శ్రీకారం చుట్టారు. జగన్ సీఎం అయితే వీటిని కొనసాగిస్తారని అందరూ అనుకున్నారు. ఈ పనులకు కాంగ్రెస్ హయాంలో కదలిక ఉండేది. జగన్ సీఎం అయిన తరువాత వైఎస్ ఆశయాలైన ప్రాజెక్టులు, కలలకు సమాధి కట్టేశారు. ఇవన్నీ చూస్తే విపక్షాలు ఆరోపిస్తున్నట్లుగా జగన్ వైఎస్ ఆశయాలకు వారసుడు కాదనిపిస్తుంది.

తండ్రి ఆశయానికి తనయుడు సమాధి



- కడపలో ఐటీ పార్కు వైఎస్ కల
- రిమ్స్ వద్ద 52.7 ఎకరాలు ఐటీ పార్కుకు కేటాయింపు
- ఆ స్థలాన్ని అస్మదీయులకు అప్పగించిన జగన్
- కడప - బెంగళూరు రైలు మార్గం జిల్లా ప్రజల చిరకాల స్వప్నం
- వైఎస్ హయాంలో అడుగులు
- ఆయన మరణానంతరం పెండ్లిమర్రి వరకు పూర్తి
- దానినీ అటకెక్కించిన జగన్
- సోమశిల వాటర్ స్కీంకూ మంగళం



కడప-బెంగళూరు రైలు మార్గం పనులు జగన్ హయాంలో ఆగిపోవడంతో పట్టాల మధ్య పెరిగిన కంపచెట్లు

(కడప-ఆంధ్రజ్యోతి): కడపలో ఐటీ పార్కు ఏర్పాటు చేయాలన్నది దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి కల. జిల్లాకు చెందిన యువత ఐటీ ఉద్యోగాల కోసం బెంగళూరు, చెన్నై, హైదరాబాదు, బాంబే, పూణెలాంటి నగరాలకు వెళ్లేవారు. దీంతో కడపను ఐటీ హబ్ చేయాలని వైఎస్ భావించారు. కడపలో విమానాశ్రయం ఉండడం, అతి దగ్గరలోనే చెన్నై, బెంగళూరులో ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు ఉండడంతో ఐటీ కంపెనీలు తీసుకురావచ్చని భావించారు. అందుకు తగ్గట్లుగానే నగర శివారులోని రిమ్స్ వద్ద 'సీపీ బ్రౌన్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ సిటీ' పేరుతో 52.70 ఎకరాల భూమిని కేటాయించారు. వైఎస్ మరణానంతరం ఐటీ పార్కు రాకపోయినా.. ఆ స్థలం మాత్రం అలాగే ఉండిపోయింది. 2014 ఎన్నికల్లో వైసీపీ నుంచి పోటీ చేసిన అంజద్‌బాషా కడపను ఐటీ సిటీగా మారుస్తామని హామీ ఇచ్చారు.

ఇప్పుడంతా ఐటీ ట్రెండ్ నడుస్తోంది. చంద్రబాబు హయాంలో నారాలోకేశ్ మంగళగిరి, విజయవాడ ప్రాంతాల్లో పలు ఐటీ పరిశ్రమలు తీసుకువచ్చారు. జగన్ కూడా సీఎం కావడంతో కడప జిల్లా యువత ఐటీపై కలగన్నారు. తండ్రి వైఎస్ హయాంలో కేటాయించిన ఐటీ స్థలంలో ఐటీ కంపెనీలు వస్తే జిల్లా దశ దిశ మారుతుందని అందరూ భావించారు. అయితే జగన్ వైఎస్ ఆశయానికి తూట్లు పొడిచారు. ఆ భూమిని షిరిడిసాయి ట్రాన్స్‌ఫార్మర్ల తయారీ కంపెనీ షిరిడీ సాయిఎలక్ట్రికల్స్‌కు కట్టబెట్టారు. విలువైన భూమిని అతి తక్కువకే కట్టబెట్టారు. ఇప్పుడు రిమ్స్ ఏరియా బాగా డెవలప్ అయింది. అక్కడ స్థలాలకు డిమాండ్ ఉంది. ఎకరా కోటి నుంచి రెండుకోట్ల వరకు ఉందంటారు. అయినా ఐటీ హబ్ కోసం స్థలాన్ని తక్కువ ధరకే కట్టబెట్టి ఐటీ కలకు జగన్ శాశ్వత సమాధి చేశారు.

కడప-బెంగళూరు మార్గం అటకెక్కించారు

కడప-బెంగళూరు రైలు మార్గం జిల్లావాసుల చిరకాల వాంఛ. ఈ సౌకర్యం ఉంటే జిల్లావాసులకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. కడప-బెంగళూరు రైలు మార్గం నిర్మాణానికి దివంగత వైఎస్ హయాంలోనే అడుగులు పడ్డాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రూ.1,023 కోట్లతో 258 కి.మీ మేర కడప నుంచి రాయచోటి మీదుగా బెంగళూరుకు రైలు మార్గం నిర్మించాల్సి ఉంది. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం అనుమతి ఇచ్చింది. అయితే ఆలస్యం అమృతం విషం అన్నట్లుగా అప్పట్లో రైలు మార్గం ప్రారంభానికి ఆలస్యం కావడం, వైఎస్ మృతితో.. అనంతరం అంచనా వ్యయం పెరిగింది. 2009- 2010 ఆర్థిక సంవత్సరంలో రూ.1,784.64 కోట్లకు చేరింది. సర్వేకోసం బడ్జెట్‌లో మరో కోటి అప్పట్లో అదనంగా కేటాయించారు. 2010-11లో రెండు కోట్లు, 2011-12లో రూ.50 కోట్లు, 2012-13లో రూ.38 కోట్లు, 2013-14లో రూ.70 కోట్లు, 2014-15లో రూ.30 కోట్లు కేటాయించారు. అంటే టీడీపీ హయాంలో కూడా ఈ రైలు మార్గానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. అయితే 258 కిమీ రైలు మార్గానికి కేవలం పెండ్లిమర్రి వరకు 22 కి.మీ మాత్రమే పూర్తయింది. దీనికి జగన్ నిధులు కేటాయించకుండా అటకెక్కించారు.



వైసీపీ ప్రభుత్వ ప్రతిపాదనతో..

కడప-బెంగళూరు రైల్వే మార్గం ఇటు కడప జిల్లాతో పాటు అటు అన్నమయ్య జిల్లావాసుల సౌలభ్యం కోసం రూపొందించారు. అప్పట్లో అన్నమయ్య జిల్లా ఏర్పడుతుందనే ఆలోచనతో ఉన్నట్లు చెబుతారు. జిల్లాల పునర్విభజనతో రాయచోటి అన్నమయ్య జిల్ల కేంద్రం అయింది. ఆ ఊరికి రైలు మార్గం లేదు. కడప-బెంగళూరు మార్గం పూర్తయితే ఆ జిల్లాకు ఇది ప్రధాన రైల్వేమార్గం అవుతుంది. అయితే జగన్ సీఎం అయ్యాక సొంత నియోజకవర్గం ప్రయోజనాల కోసం ఈ లైను మార్గాన్ని అటకెక్కించారు. ముద్దనూరు, పులివెందుల మీదుగా బెంగళూరు రైలు మార్గానికి ప్రతిపాదనలు తెచ్చారు. దీనికి ఏడాది క్రితం రాష్ట్ర ప్రభుత్వం ఓకే చెప్పింది. రాష్ట్ర పభుత్వం ప్రతిపాదనతో కేంద్రం కూడా రాయచోటి మీదుగా కడప-బెంగళూరు రైలు మార్గాన్ని ఫ్రీజ్‌లో పెట్టినట్లు చెబుతారు.

బెంగళూరు రైలుమార్గం ఇలా..

కడప-బెంగళూరు రైలు మార్గం మొత్తం 258 కి.మీ. దీనిని నాలుగు విడతలుగా పనులు చేపట్టాలని భావించారు. మొదటి విడతలో కడప నుంచి పెండ్లిమర్రి వరకు 22 కిమీ. రెండో విడతలో పెండ్లిమర్రి నుంచి అన్నమయ్య జిల్లాలోని వాయల్పాడు వరకు, మూడో విడతలో మదనపల్లె నుంచి మదకట్ట వరకు, నాలుగో విడతలో మదకట్ట నుంచి బెంగళూరు వరకు రైలు మార్గం నిర్మించాల్సి ఉంది. వాయల్పాడు నుంచి మదనపల్లె వరకు గతంలో వేసిన రైల్వేలేను ఉంది. కడప నుంచి పెండ్లిమర్రి, ఇడుపులపాయ, రాయచోటి, మదనపల్లె, వాయల్పాడు మీదుగా బంగారుపేట నుంచి బెంగళూరుకు రైలు మార్గం విస్తరించాల్సి ఉంది. మార్గమధ్యంలో 18 రైల్వే స్టేషన్లు ఉన్నాయి. ఇప్పటికే కడప, మదనపల్లెల్లో రైల్వేస్టేషన్లు ఉన్నాయి. ఇంత ప్రాముఖ్యమైన రైల్వేలైన్‌ను జగన్ ప్రభుత్వం అటకెక్కించింది. మొదటి విడతలో భాగంగా కడప నుంచి పెండ్లిమర్రి వరకు 22 కి.మీ మాత్రమే ఆగిపోయింది. తర్వాత పనులు ఆగిపోవడంతో ఆ మార్గంలో రైలు పట్టాల మధ్య కంపచెట్లు పెరిగిపోయాయి.

సోమశిలకు మంగళం

రాజశేఖర్‌రెడ్డి హయాంలో రూ.600 కోట్ల వ్యయంతో సోమశిల నీటి పథకానికి శ్రీకారం చుట్టారు. సోమశిల నుంచి నీటిని తీసుకువచ్చి కడపకు శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారం కోసం అలాగే కొప్పర్తి పారిశ్రామికవాడ, యోగివేమన యూనివర్శిటీ, ట్రిబుల్‌ఐటీ, అనంతపురం జిల్లాకు తాగునీరు ఇవ్వాలన్నది ప్రధాన లక్ష్యం. ప్రతిపాదనలు తయారయ్యాయి పనులు మొదలయ్యాయి. సుమారు రూ.20 కోట్ల విలువ గల పనులు జరిగాయి. రాజశేఖర్‌రెడ్డి మరణంతో ఈ ప్రాజెక్టు నిలిచిపోయింది. జగన్ సీఎం అయిన తరువాత ఈ పథకాన్ని పూర్తి చేసింటే కడప నగరానికి నీటి ముప్పు తప్పేది. కొప్పర్తి పారిశ్రామికవాడకు నీరు పుష్కలంగా ఉండేది. కానీ జగన్ ఆ దిశగా ఎలాంటి చర్యలూ చేపట్టలేదు.



సీకేదిన్నె వద్ద తుప్పుబట్టిన సోమశిల నీటి పథకం పైపులు


నామినేషన్ల పరిశీలన

- బరిలో 148 మంది

కడప(కలెక్టరేట్), ఏప్రిల్ 26: కడప ఎంపీ స్థానానికి సంబంధించి 32 మంది నామినేషన్లు దాఖలు చేశారు. వీటిని శుక్రవారం కలెక్టర్ చాంబరులో జిల్లా ఎన్నికల అధికారి, పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి విజయరామరాజు, ఎన్నికల సాధారణ పరిశీలకులు కునాల్ సిల్కు పరిశీలించారు. అందులో 14 మంది అభ్యర్థులను ఖరారు చేసి తుది జాబితా ప్రకటించారు. 18 మందిని ఎన్నికల్లో పోటీకి అనర్హులుగా ప్రకటించారు. అలాగే 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నామినేషన్ల స్క్రూటినీని ఆయా నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులు పూర్తి చేసి తుది జాబితా విడుదల చేశారు. 317 నామినేషన్లకు గాను 134 మంది అభ్యర్థులు ఎన్నికల్లో పోటీ చేయనున్నారు.

వారికి ఓటు అడిగే నైతిక హక్కు లేదు

- మద్యపాన నిషేధం అని కల్తీ మద్యం అమ్ముతున్నారు
- చిన్నాన్నను చంపిన వారిని కాపాడుతున్నారు
- ల్యాండ్, శ్యాండ్, మట్టి మాఫియాతో కోట్లు దోచుకున్నారు
- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి
- 'ఇదీ జగనాసుర రక్తచరిత్ర' చార్జిషీట్ విడుదల



కడప, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): "ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం అన్నిరంగాల్లో వైఫల్యం చెందింది. చిన్నాన్నను చంపిన హంతకులను కాపాడుతున్నారు. ల్యాండ్, శ్యాండ్, మట్టి మాఫియాతో కోట్లు దోచుకున్నారు. వారికి ఓటు అడిగే నైతిక హక్కు లేదు" అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం కడపలోని తమ ఇంటి వద్ద మీడియా సమావేశం ఏర్పాటు చేసి జగన్‌పై ఎన్డీఏ కూటమి తయారు చేసిన 'జగనాసుర రక్తచరిత్ర' చార్జిషీట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగన్ ఐదేళ్లలో ఒక్కో కుటుంబంపై రూ.10లక్షల భారం వేశారన్నారు. ల్యాండ్, శ్యాండ్, మట్టి, రేషన్ ద్వారా రూ.800కోట్లు కొట్టేసినందుకు ఆయనపై చార్జిషీట్ విడుదల చేస్తున్నామన్నారు. పదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచి రూ.7500 కోట్లు భారం మోపినందుకు.. ఇసుక ధరలు నాలుగురెట్లు పెంచి 40లక్షల మంది భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లేకుండా దెబ్బతీసినందుకు.. అన్నక్యాంటీన్‌లను మూసివేసి పేదవాడికి అన్నం లేకుండా చేసినందుకు.. పండుగ కానుకలు, రైతు రుణమాఫీ, చంద్రన్న బీమాలాంటి వంద టీడీపీ సంక్షేమ పథకాలన్నీ రద్దుచేసిందుకు.. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సబ్‌ప్లాన్ నిధులు లక్షకోట్లు దారి మళ్లించి నిధులు కేటాయించకుండా వారి అభివృద్ధికి అడ్డుపడినందుకు చార్జిషీట్ వేస్తున్నామన్నారు. మద్యపాన నిషేధం అని కల్తీమద్యం అమ్ముతున్నారన్నారు. మెగా డీఎస్సీ అని దగా చేశారన్నారు. సీపీఎస్ రద్దుచేస్తామని చెప్పి 25శాతం హామీలపై మాట తప్పాడన్నారు. మేనిఫెస్టోను 99శాతం అమలు చేశామని చెప్పినందుకు చార్జిషీట్ ఓపెన్ చేస్తున్నామన్నారు. చిన్నాన్నను గొడ్డలితో క్రూరంగా నరికి చంపిన కిరాతకులను కాపాడుకుంటున్నందుకు, ఇసుక మాఫియాకు అన్నమయ్య డ్యామ్ కొట్టుకుపోయి దాదాపు 42 మంది మంది చనిపోయినందుకు చార్జిషీట్ వేస్తున్నామన్నారు. అదేవిధంగా చెల్లెలు పుట్టుకపై నిందలు వేసి తల్లి వ్యక్తిత్వాన్ని కూడా హననం చేసేందుకు వెనుకాడని వ్యక్తి జగన్ అన్నారు. అన్ని రంగాలలో ఈ ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. ప్రజలను ఓట్లు అడిగే నైతిక హక్కు కూడా కోల్పోయిందన్నారు. మళ్లీ కోడికత్తిలాంటి డ్రామా ఆడి పుల్లగుచ్చుకొని ప్లాస్టర్ వేసుకొని తిరుగుతున్నాడన్నారు. సొంత చెల్లిపై కూడా విమర్శలకు దిగుతున్నాడంటే ఎంత ఓటమి భయం పట్టుకుందో పులివెందుల మీటింగ్ బట్టి తెలుస్తోందన్నారు.

షర్మిలకు ఓటు వేస్తే వివేకాకు న్యాయం చేసినట్టే


- జోరుగా డాక్టర్ సునీత, రాజశేఖర్ ప్రచారం

పులివెందుల టౌన్, ఏప్రిల్ 26: కడప ఎంపీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న వైఎస్ షర్మిలకు ఓటు వేస్తే వైఎస్ వివేకానందరెడ్డికి న్యాయం చేసినట్లేనని డాక్టర్ సునీత అన్నారు. పులివెందులలోని రాజారెడ్డి కాలనీ, చిన్నన్న రూములు, రాజీవ్‌కాలనీ, జయమ్మకాలనీలలో వైఎస్ వివేకా కుమార్తె సునీత, గుంతబజార్‌లో ఆమె భర్త రాజశేఖర్‌రెడ్డ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివంగత నేత వైఎస్సార్ బిడ్డ షర్మిలకు ప్రతి ఓటరు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. సీబీఐ దర్యాప్తు సంస్థ నిందితుడుగా తేల్చిన అవినాశ్‌రెడ్డికి మళ్లీ ఎంపీగా సీటు ఇచ్చారని.. హత్యారోపణలు ఉన్న వారికి కాకుండా ఎటువంటి నేర చరిత్ర లేని షర్మిలకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. వైఎస్ వివేకాను ఎంతో దారుణంగా చంపి వేశారని, ఐదు సంవత్సరాలుగా ఎటువంటి న్యాయం జరగలేదని షర్మిలనే తన వెంట ఉందని అన్నారు. అంతేకాకుండా వివేకానందరెడ్డికి షర్మిలను ఎంపీ చేయాలనే చిరకాలవాంఛ అన్నారు. ప్రతి ఒక్కరు షర్మిలకు ఓటు వేసి న్యాయాన్ని గెలిపించాలని కోరారు. ఈ ఎన్నికల ప్రచారంలో శివప్రకాశ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు జగదీశ్వర్‌రెడ్డి, బోనాల బాబురెడ్డి, తిరుపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పులివెందులలో చేపట్టిన కాంగ్రెస్ ప్రచారంలో మాట్లాడుతున్న సునీత

● శ్మశానవాటిక ఏర్పాటు చేస్తేనే ఓట్లు వేస్తాం



సిద్దవటం, ఏప్రిల్ 26: మండలంలోని కడపాయపల్లె హరిజనవాడ ప్రజలు గ్రామంలో ఓ చెట్టుకు ఏర్పాటు చేసిన బ్యానర్ చర్చనీయాంశంగా మారింది. అక్కడ నివసిస్తున్న ప్రజలకు శ్మశానవాటిక లేక పది సంవత్సరాల నుంచి నానా ఇబ్బందులు పడుతున్నారు. ఎంతో మంది అధికారులకు విన్నవించినా ఏ మాత్రం ఫలితం లేకపోయిందని చివరికి ఓ చెట్టుకు బోర్డును ఏర్పాటు చేసి ఓట్లు కావాలంటే స్మశానం వాటిక ఏర్పాటు చేయాలని కొన్ని అంశాలను పొందుపరిచారు. ఈ విషయం చుట్టుపక్కల గ్రామాల్లో చర్చనీయాంశమైంది. నాయకులు వస్తూపోతూ ఉన్నారు తప్ప శ్మశానవాటిక ఏర్పాటు చేయలేదని తమ గ్రామంలో ఈ సమస్య పూర్తైతేనే ఓట్లు వేస్తామని ప్రజలు పేర్కొన్నారు. పది సంవత్సరాలకు పైగా కాలనీవాసులు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగి కాళ్లరిగిపోయాయని అయినా ఏ మాత్రం ఫలితం కనిపించలేదని ప్రజలు పేర్కొన్నారు. ఇప్పటికైనా పాలకులు శ్మశానవాటిక ఏర్పాటు చేసి చనిపోయిన వారి ఆత్మకు శాంతి కలిగించాలని ప్రజలు పేర్కొంటున్నారు.



శ్మశానవాటిక ఏర్పాటు చేయాలని చెట్టుకు బోర్డు ఏర్పాటు చేసిన దృశ్యం

● ఇదేందయ్యా.. ఇది..!

● చెట్టు కింద పోస్టల్ బ్యాలెట్ హెల్ప్‌డెస్క్ ఏర్పాటుపై మండిపాటు



పీలేరు, ఏప్రిల్ 26: "రోడ్డు పక్కన చెట్టు కింద హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి ఉపాధ్యాయులను అవమానిస్తారా? ఏదైనా రాసుకోవడానికి కనీసం ఒక బెంచు కూడా ఏర్పాటు చేయరా? ఉపాధ్యాయులకు ఇచ్చే గౌరవం ఇదేనా" అంటూ పీలేరు మండలంలోని పలువురు ఉపాధ్యాయులు ఎన్నికల అధికారులపై మండిపడ్డారు. పోస్టల్ బ్యాలెట్‌ల హెల్ప్ డెస్క్‌ను రోడ్డు పక్కన, ఓ చెట్టు కింద ఏర్పాటు చేయడం వారి ఆగ్రహానికి కారణమైంది. పోస్టల్ హెల్ప్‌డెస్క్‌ను గతంలో పీలేరు తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించేవారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైన నాటి నుంచి దాన్ని తహసీల్దారు కార్యాలయం వెలుపలికి తరలించారు. నామినేషన్ల స్వీకరణ సమయంలో తహసీల్దారు కార్యాలయంలోకి ఇతరులను అనుమతించరాదన్న ఎన్నికల సంఘం నిబంధనల మేరకు అటు అధికారులు, ఇటు పోలీసులు ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బందిని తప్ప ఇతరులను కార్యాలయంలోనికి అనుమతించడం లేదు. దీంతో పోస్టల్ బ్యాలెట్ పొందిన ఉద్యోగులకు ఇబ్బంది అవుతున్నట్లు గ్రహించిన అధికారులు దాన్ని తహసీల్దారు కార్యాలయం గోడకు ఆనుకుని చెట్టు కింద ఏర్పాటు చేశారు. తమ దరఖాస్తుల కోసం వచ్చిన పలువురు ఉపాధ్యాయులు శుక్రవారం అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం ఒక బెంచి, ఎండన పడి వచ్చిన వారు కూర్చోవడానికి కుర్చీ ఏర్పాటు చేయకపోవడం ఏమిటని వారు అసహనం వ్యక్తం చేశారు. రోడ్డు మీద కాకుండా తహసీల్దారు కార్యాలయానికి పక్కనే ఉన్న ఎంపీడీవో కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని వారు కోరారు. నామినేషన్ల పరిశీలన కార్యక్రమం కూడా శుక్రవారం పూర్తయినందున ఈ విషయంపై ఆలోచించుకోవాలన్నారు.



పీలేరు తహసీల్దారు కార్యాలయం బయట చెట్టుకింద ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ హెల్ప్‌డెస్క్


2021లో కొట్టుకుపోయిన పాపిరెడ్డిగారిపల్లె-మహల్ గ్రామాల మధ్యలో ఉన్న బాహుదా బ్రిడ్జి (ఫైల్)


ప్రమాదకరంగా మారిన పుట్టావాండ్లపల్లె బ్రిడ్జి

కూలిపోతేగానీ కొత్తవి కట్టరేమో..


పుట్టావాండ్లపల్లె బ్రిడ్జి వద్ద వాగులో పడిపోయిన టిప్పర్ (ఫైల్)


పీలేరు మండలం బాలంవారిపల్లె పంచాయతీ నాలేవాండ్లపల్లె వద్ద పింఛా నదిపై ఉన్న లోలెవల్ వంతెన

- **పీలేరు నియోజకవర్గంలో శిథిలావస్థలో పలు వంతెనలు**
- **పట్టించుకోని అధికార పార్టీ నేతలు, అధికారులు**

పీలేరు/కలకడ/వాల్మీకిపురం, ఏప్రిల్ 26: రహదారులు, వంతెనలు నాగరికతకు చిహ్నాలు అంటారు. శిథిలావస్థకు చేరుకుని, ఇప్పుడో, ఇంకొంచెం సేపటికో కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న బ్రిడ్జీలు వేటికి సంకేతాలో పాలకులే చెప్పాలి. పీలేరు నియోజకవర్గంలోని పీలేరు, కలకడ, వాల్మీకిపురం మండలాల్లోని పలు బ్రిడ్జీలు శిథిలావస్థకు చేరుకుని కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయి. వాటి గురించి ప్రజలు తమ దృష్టికి తెచ్చినప్పుడల్లా స్థానిక ఎమ్మెల్యేగానీ, ఎంపీగానీ అదిగో, ఇదిగో అంటూ కాలయాపన చేశారు తప్ప వాటి మరమ్మతులు గురించిగానీ, పునర్నిర్మాణం గురించి గానీ పట్టించుకోలేదు. పోనీ వాటి దుస్థితి గురించి వారికి తెలియదా అంటే తెలుసు. ఆయా గ్రామాలకు వెళ్లాల్సిన సమయంలో ఆ బ్రిడ్జీల మీదనే ప్రయాణించాలి. మరి అధికారంలో ఉండి కూడా వాటి గురించి ఎందుకు పట్టించుకోలేదో వారికే తెలియాలి. సామాన్య ప్రజలేమో అవి కూలిపోతేగానీ పాలకులు పట్టించుకోరేమో అని వాపోతున్నారు.

శిథిలావస్థలో గూడరేవుపల్లె వంతెనలు

పీలేరు మండలం గూడరేవుపల్లె వద్ద బడబళ్ల వంకపై ఉన్న బ్రిడ్జీ శిథిలావస్థకు చేరుకుని నేడో రేపో కూలిపోయేందుకు సిద్ధంగా ఉంటూ అటు వాహనదారులు, ఇటు అధికారులు, ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. పీలేరు మండలంలోని అంతర్గత ప్రధాన రహదారుల్లో పీలేరు-తలపుల మార్గం ఒకటి. ఆ మార్గంలో గూడరేవుపల్లె, జాండ్ల, తలపుల, మేళ్లచెరువు గ్రామ పంచాయతీలు ఉండగా ఈ దారి గుండా పొరుగునే ఉన్న కేవీపల్లె మండలం జిల్లేళ్లమంద, కడప జిల్లా పింఛా, ఎర్రావారిపాళెం మండలంలోని యల్లమంద, బోడేవాండ్లపల్లె ప్రాంతాలకు చేరుకోవచ్చు. పీలేరు డిపోకు ఆదాయం తెస్తున్న అతికొద్ది మార్గాల్లో ఇదీ ఒకటి. అంతటి ప్రాధాన్యత ఉన్న ఈ మార్గాన్ని గూడరేవుపల్లె బ్రిడ్జి వణికిస్తోంది. ఎప్పుడో దశాబ్దాల క్రితం నిర్మించిన ఆ బ్రిడ్జి పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని ఇప్పుడో, అప్పుడో కూలిపోయేందుకు సిద్ధంగా ఉంది. అధికార పార్టీకి చెందిన మండల కన్వీనరే గూడరేవుపల్లె సర్పంచ్‌గా ఉన్నా ఎందుకనో ఆ బ్రిడ్జి పునరుద్ధరణపై దృష్టి సారించలేదు. ఆ వంతెనపై ప్రతిరోజూ వేలాది సాధారణ వాహనాలతో పాటు మట్టి, ఇసుక టిప్పర్లు తిరుగుతుంటాయి. జాండ్ల, గూడరేవుపల్లె పంచాయతీ సరిహద్దుల్లోని పింఛా నది పరీవాహక ప్రాంతం నుంచి సేకరించిన ఇసుకను వందలాది ట్రాక్టర్లు, పదుల సంఖ్యలో టిప్పర్ల ద్వారా ప్రతిరోజూ ఆ వంతెనపై నుంచి పీలేరు పట్టణానికి తరలిస్తుంటారు. అధిక బరువుతో ఉండే ట్రాక్టర్లు, టిప్పర్ల కారణంగా వంతెన రోజురోజుకీ బలహీనపడుతోందని, ఏ సమయంలో ఏం జరుగుతుందోనన్న భయం తమను వెంటాడుతోందని గూడరేవుపల్లె గ్రామస్తులు తెలిపారు. వారి భయాలకు ఆ బ్రిడ్జిపై అనునిత్యం జరుగుతున్న ప్రమాదాలు బలం చేకూరుస్తున్నాయి. ఆ బ్రిడ్జిపై ఎటువంటి సేఫ్టీ రెయిలింగ్స్ లేకపోవడంతో రెండు వేర్వేరు ఘటనల్లో రెండు ఆటోలు వాగులో బోల్తాపడి ఆటోడ్రైవర్ల ప్రాణాలు పోగొట్టుకున్నారు. 2022లో ఆ బ్రిడ్జిపై ఓ ప్రమాదం జరిగినప్పుడు అటు ప్రజాప్రతినిధులు, ఇటు ఆర్‌అండ్‌బీ అధికారులు కాస్త హడావిడి చేశారు తప్ప ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఇదే పంచాయతీ పరిధిలోని మరో బ్రిడ్జి కూడా ప్రమాదకరంగా మారింది. పీలేరు-రొంపిచెర్ల మార్గంలో పుట్టావాండ్లపల్లె వద్ద దశాబ్దాల క్రితం నిర్మించిన బ్రిడ్జి గత పదేళ్లుగా పెరిగిన భారీ వాహనాల తాకిడికి కూలిపోయేందుకు సిద్ధంగా మారింది. 2022 డిసెంబరు మాసంలో ఆ బ్రిడ్జిపై నుంచి ఓ టిప్పర్ బడబళ్లవంకలో పడిపోవడంతో అందరి దృష్టి ఆ బ్రిడ్జిపై పడింది. రియల్ ఎస్టేట్ వెంచర్లు అభివృద్ధి చేసుకునేందుకు పుట్టావాండ్లపల్లె ప్రాంతం నుంచి పీలేరుకు టిప్పర్ల ద్వారా మట్టిని తరలించుకునేందుకు ఆ బ్రిడ్జి అనుకూలంగా ఉండడంతో దానిపై రాకపోకలు పెరిగాయి. దీంతో అది బలహీనంగా మారింది. ఆ వంతెనపై రియల్టర్లే అప్పుడప్పుడు కాసిన్ని మరమ్మతులు చేసుకుని తమ పనికానిచ్చుకుంటున్నారు. 2022 డిసెంబరులో ఆ బ్రిడ్జీలను ఆర్‌అండ్‌బీ శాఖ ఈఈ అరవిందాదేవి స్వయంగా పరిశీలించి వాటి స్థానంలో కొత్తవి నిర్మించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అవి ఇంతవరకు ఎందుకు కార్యరూపం దాల్చలేదో ఏలిన వారికే తెలియాలి. ఆ రెండు బ్రిడ్జీల వద్ద ఏదైనా పెద్ద ప్రమాదం జరగక ముందే అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వంతెనలను బాగు చేయాలని గూడరేవుపల్లె గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఆ బ్రిడ్జీలకు మరమ్మతులు చేయాలని తాము ఇప్పటికే పలుమార్లు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామని, వారి ఆదేశాలు, నిధుల మంజూరు కోసం ఎదురుచూస్తున్నామని పీలేరు ఆర్‌అండ్‌బీ శాఖ డీఈ చంద్రశేఖర్ తెలిపారు. అదే విధంగా పీలేరు మండలం బాలంవారిపల్లె పంచాయతీ పరిధిలోని నాలేవాండ్లపల్లె వద్ద నుంచి ఎనుములవారిపల్లెకు వెళ్లే మార్గంలో పింఛా నదిపై ఉన్న లోలెవల్ వంతెన పింఛా నదిలో నీటి ప్రవాహం పెరిగినప్పుడు ప్రమాదకరంగా మారుతోంది. గతంలో అక్కడ పింఛా నది దాటుతూ ఓ జంట ప్రాణాలు పోగొట్టుకుంది. అదే పంచాయతీలో పీలేరు-సదుం మార్గంలోని మరో వంతెన కూడా శిథిలావస్థకు చేరుకుంది.

వాల్మీకిపురం మండలంలో...

వాల్మీకిపురం మండలంలోని మంచూరు గ్రామం వద్ద బాహుదా నది కాలువపై నిర్మించిన బ్రిడ్జి ప్రస్తుతం ప్రమాదకరంగా మారింది. ఈ బ్రిడ్జి గూండా నిత్యం ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తుండడం గమనార్హం. భారీ వర్షాలు కురిసిన ప్రతిసారీ తూతూ మంత్రంగా అధికారులు చర్యలు చేపడుతున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చేపట్టడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కలకడలో కుంగిపోతున్న బాహుదా బ్రిడ్జి

కలకడ మండలం పాపిరెడ్డిగారిపల్లె, కలికిరి మండలం మహల్ గ్రామం మార్గమధ్యంలో బాహుదా నదిపై నిర్మించిన బ్రిడ్జి కుంగిపోతోంది. 2021లో నివర్ తుఫాను కారణంగా నదిలో నీరు ఉధృతంగా ప్రవహించి బ్రిడ్జి మధ్య భాగం నదిలో కొట్టుకుపోయింది. అప్పట్లో అధికార పార్టీ నాయకులు దానిని పూర్తిస్థాయి నిర్మాణంపై దృష్టి సారించలేదు. కొట్టుకుపోయిన ప్రాంతంలో తాత్కాలికంగా రాళ్లు, మట్టి వేయించి చేతులు దులుపుకున్నారు. అయితే కాలక్రమంలో బ్రిడ్జి సమీపంలో ఇసుక పూర్తిగా తోడేయడంతో అది ఓ పక్కకు ఒరిగిపోవడమే కాకుండా కొద్దికొద్దిగా కుంగిపోతోంది. ఆ బ్రిడ్జిపై నిత్యం టిప్పర్లు, ట్రాక్టర్లు రాకపోకలు సాగిస్తుండడంతో అది ఎప్పుడు కూలిపోతుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఆ బ్రిడ్జి ఉన్న మార్గం కలకడ, గుర్రంకొండ మండలాల ప్రజలు కలికిరి, తిరుపతి, చిత్తూరు తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు అనుకూలమైనది. కలికిరి మండలం మహల్, అద్దవారిపల్లె గ్రామాల ప్రజలు పొలాల వద్దకు సులువుగా చేరుకునేందుకు వీలుంది. ఆ బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టని అధికార పార్టీ నేతల తీరుపై ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు.

ఫ్యామిలీ పాలిటిక్స్

మొన్నటి వరకూ ఆమె ఓ సంపన్న కుటుంబంలో గృహిణి. మూడు దశాబ్దాలుగా కుటుంబమంతా రాజకీయాల్లో తలమునకలవుతున్నా ఆమె మాత్రం కుటుంబ వ్యవహారాలకు మాత్రమే పరిమితమయ్యారు. ఎన్నికల్లో తన భర్త పోటీ చేస్తున్నా ప్రచారానికి దూరంగానే ఉంటూ పిల్లలూ, వారి చదువులూ, బాగోగులూ, కుటుంబ నిర్వహణ చూసుకునేవారు. దాదాపు 8 నెలల క్రితం జరిగిన ఒక సంఘటన ఆమె వ్యవహార శైలిని పూర్తిగా మార్చేసింది. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించిన అంగళ్లులో చంద్రబాబుపై జరిగిన దాడి సంఘటనలకు సంబంధించి నమోదైన పోలీసు కేసులు ఆమెను ఇంటి గడప దాటేలా చేశాయి. ఆమె మరెవరో కాదు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ప్రస్తుత పీలేరు టీడీపీ అభ్యర్థి నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి సతీమణి. అంగళ్లు కేసుల సందర్భంగా అనూహ్యంగా ఇంటి గడప దాటి బయటకొచ్చిన తనూజారెడ్డి ఇప్పుడు మొదటిసారి ఎన్నికల ప్రచారంలో కుమార్తె, కోడలుతో సహా పాల్గొంటున్నారు.


కోడలు షమారెడ్డితో కలిసి ప్రచారం చేస్తున్న తనూజారెడ్డి (ఫైల్)

మొదటిసారి ప్రజల్లోకి..

● భర్త కోసం తనూజా ప్రచారం ● కుటుంబ సభ్యులంతా భాగస్వామ్యం

కలికిరి, ఏప్రిల్ 26: నల్లారి తనూజారెడ్డి.. క్లుప్తంగా తనూ జమ్మ.. ఎనిమిది నెలల క్రితం వరకూ ఆమె పేరు పెద్దగా ఎవరికీ తెలియదు. ముఖ పరిచయం ఉన్న వారు కూడా అంతంత మాత్రమే. అది 2023 ఆగస్టు 4వ తేదీ. చంద్రబాబు అంగళ్లు పర్యటన సందర్భంగా వైసీపీ మూకలు రాళ్లు రువ్వి నానా రభస సృష్టించారు. ఆపై చంద్రబాబుతో సహా మొత్తం 20 మందిపై 307 హత్యాయత్నం సహా పది సెక్షన్లతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందులో కిశోర్‌కుమార్‌రెడ్డిని కూడా చేర్చారు. ఇది కాకుండా విడిగా ఆయనపై మరో కేసు కూడా నమోదైంది. ఇదిలా ఉండగానే ఆ తరువాత టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలపై మరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇందులో ఏకంగా ఒక్క పీలేరు నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన 137 మందిని ఇరికించేశారు. కేసుల విషయంలో బెయిళ్ల కోసం కిశోర్‌కుమార్‌రెడ్డి దాదాపు నెలన్నరగా విజయవాడలో మకాం వేశారు. స్థానికంగా కార్యకర్తలపై పోలీసుల వేధింపులు మొదలయ్యాయి. అరెస్టు కోసమంటూ ఈ 137 మంది ఇళ్లలో సోదాలు, ఆచూకీ తీయడాలు కూడా మొదలు పెట్టారు. ఈ నేపథ్యంలో ఇంటి వ్యవహారాలకే పరిమితమై హైదరాబాదులో ఉన్న తనూజారెడ్డికి నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలు అవగతమయ్యాయి. ఇక అనుకున్నదే తడవుగా నియోజకవర్గంలో వరుస పర్యటనలకు సంసిద్ధమయ్యారు. కేసుల్లో ఉన్న ప్రతి కుటుంబాన్ని పరామర్శించారు. పది రోజుల పాటు పరామర్శలతో వచ్చిన అనుభవాలతో ఆమె దాదాపు నియోజకవర్గమంతా మమేకమయ్యారు. ఆ తరువాత ఎన్నికలు కూడా రావడంతో ఆమె ఇంటింటి పర్యటనకు బయలుదేరారు. వీలైనన్ని గ్రామాల్లో ప్రతి ఇంటి గడప తొక్కాలని, ప్రతి తలుపూ తట్టాలనే సంకల్పంతో ఏకబిగిన ప్రచారం చేస్తున్నారు.

బిడ్డలతోనూ ప్రచారం

రోజు రోజుకూ తనూజారెడ్డి విశేషంగా ప్రచారం చేస్తున్నారు. తనతో పాటు కుమార్తె డాక్టర్ వైష్ణవి, కోడలు డాక్టర్ షమారెడ్డి కూడా ఇంటింటి ప్రచారం మొదలు పెట్టారు. ఇందులో ప్రధానంగా షమారెడ్డి ప్రచారం కూడా పట్టణాల్లో ప్రజల్ని బాగా ఆకట్టుకుంటోంది. ధారాళంగా హైదరాబాదు ఉర్దూ మాట్లాడంతో ముస్లిం మహిళలు, వృద్ధులతో కలిసిపోతున్నారు. మరో వైపు కుమారుడు డాక్టర్ నల్లారి అమరనాథరెడ్డి కూడా తల్లీ, చెల్లీ, సతీమణి కార్యక్రమాలను సమన్వయం చేసుకుంటూ ప్రచారంలో వేగాన్ని పెంచుతున్నారు.

నాటి కడలూరే.. నేటి రైల్వేకోడూరు

● చుట్టూ ఏర్లు... మధ్యలో ఊరు ● ఒకప్పుడు వెయ్యి ఓటర్లు
● ప్రస్తుతం 2,01,544 మంది ఓటర్లు



రైల్వేకోడూరు, ఏప్రిల్ 26: నాడు కడలూరు అనే పేరుతో పేరుగాంచి నేడు రైల్వేకోడూరుగా మారింది. బ్రిటీష్ కాలంలోనే కడలూరు అని పిలిచేవారు. చుట్టూ ఏర్లు.. మధ్యలో ఊరు ఉంది. అప్పుడు వెయ్యి మంది ఓటర్లు, 1500 మంది జనాభా ఉండేవారు. ప్రస్తుతం 2,01,544 మంది ఓటర్లు ఉన్నారు. చిన్న పల్లెటూరు ఉన్న కడలూరు గ్రామం నేడు పెద్దగా విస్తరించింది. 1866 బ్రిటీష్ కాలంలో కడలూరు రైల్వేస్టేషన్ నిర్మాణానికి నోచుకుంది. తర్వాత కడలూరు కాస్త ఇక్కడ రైల్వేస్టేషన్ ఏర్పాటు కావడంతో రైల్వేకోడూరుగా మారింది. కడలూరుగా ఉన్న కాలం నుంచి ఇక్కడ పండించే మామిడి, అరటి, నిమ్మ తదితర పంటలకు ఆలవాలం. ఎక్కువగా రైళ్లలోనే రైతులు, వ్యాపారులు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసేవారు. పంట పూర్తయిన తర్వాత రైళ్లలో వ్యాపారులు, రైతులు కలసి ఇతర రాష్ట్రాల్లో ఉన్న మార్వాడీల వద్దకు వెళ్లేవారు. తాము పంపిన సరుకు లెక్కలు వేసుకుని బంగారు నగలు తెచ్చుకునే వారని సీనియర్ సిటిజన్లు చెబుతున్నారు. కడలూరు గ్రామంలో ప్రజలు ఏకతాటిపై ఉండేవారని సీనియర్ సిటిజన్లు చెబుతున్నారు.

మోదీ సభకు స్థల పరిశీలన

కలికిరి, ఏప్రిల్ 26: పీలేరు నియోజకవర్గంలో ప్రధాని మోదీ ఎన్నికల పర్యటనల్లో భాగంగా పీలేరు నియోజకవర్గంలో బహిరంగ సభ తేదీ ఖరారయ్యింది. మే 3వ తేదీ మధ్యాహ్నం టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి తరఫున జరిగే బహిరంగ సభకు మోదీ హాజరుకానున్నట్లు బీజేపీ వర్గాల ద్వారా తెలిసింది. దీనికి తగ్గట్లు సభా ప్రాంగణం కోసం సరిపడా స్థలాన్ని ఎంపిక చేయడానికి నాయకులు శుక్రవారం ప్రయత్నాలు ప్రారంభించారు. కలికిరి సమీపంలో సీఆర్‌పీఫ్‌కు వెళ్లే దారిలో వున్న స్థలాన్ని బీజేపీ, టీడీపీ అభ్యర్థులు నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, కిశోర్‌కుమార్‌రెడ్డి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేశ్‌లు పరిశీలించారు. ప్రధాని ప్రోటోకాల్‌కు అనుగుణంగా స్థలం సరిపోతుందా, చాలకపోతే దాని చుట్టుపక్కల స్థలాన్ని ఎంత వరకూ కలుపుకోవచ్చుననే అంశాల గురించి చర్చించారు. అంతకు ముందు పీలేరు పట్టణ శివార్లలో అనుకూలంగా వున్న స్థలాలను కూడా ఈ సందర్భంగా పరిశీలించారు. ఇందులో భాగంగా ఫిబ్రవరిలో జరిగిన చంద్రబాబు సభా ప్రాంగణాన్ని కూడా పరిగణనలోకి తీసుకున్నారు. సభా ప్రాంగణానికి అనువైన స్థలం ఎంపిక కోసం ఇంకా ఒకటి రెండు చోట్ల పరిశీలించనున్నట్లు తెలుస్తోంది.


కలికిరిలో సభా స్థలాన్ని పరిశీలిస్తున్న కిరణ్‌కుమార్ రెడ్డి, కిశోర్‌కుమార్ రెడ్డి, సాయిలోకేశ్

ఉప ఎన్నికల వేళ వరాల వర్షం కురిపించారు.
అభివృద్ధి అదిరిపోతుందన్నట్లు శంకుస్థాపనలు సాగించారు.
'తెలుగుగంగ కుడి కాలువ పనులు పూర్తి చేసి ఇక్కడ భూములకు సమృద్ధిగా సాగునీరు అందిస్తాం... నియోజకవర్గంలో బ్రిడ్జిల నిర్మాణాలు చేపట్టి మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తాం..
అంటూ అప్పట్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గొప్పగా హామీ ఇచ్చారు... అలాగే 2020లో పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, దివంగత ఎమ్మెల్యే వెంకట సుబ్బయ్యలు కూడా ముంపువాసులను ఆదుకుంటామని.. పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు.
అయితే ముఖ్యమంత్రి శంకుస్థాపనలు ముందుకు సాగలేదు.
వైసీపీ నేతల హామీలు ముంపులోనే మునిగిపోయాయి.
వైసీపీ ఐదేళ్ల పాలన ముగిసిపోవడం...
మళ్లీ ఎన్నికలు రానే రావడంతో జనంలోకి వెళ్లేందుకు ఆ పార్టీ నేతలు ముఖం చాటేసే పరిస్థి తులు కనిపిస్తున్నాయి.

మోసం గురూ!

గంగ కాలువల గతేంటి.. బ్రిడ్జిల మాటేంటి..!

● ముందుకు సాగని ముఖ్యమంత్రి హామీలు ● ముంపులో కలిసిన వైసీపీ నేతల మాటలు ● జనంలోకి వెళ్లేందుకు జంకుతున్న వైనం

బద్వేలు, ఏప్రిల్ 26: మైదుకూరు, బద్వేలు నియోజకవర్గా లకు ప్రాణాధారమైన తెలుగుగంగ ప్రాజెక్టు ఇప్పటివరకు కూడా బద్వేలు నియోజకవర్గంలోని చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిం చే పరిస్థితులు లేవు. 2001లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బద్వేలు పట్టణంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తూ.. రూ.54 కోట్లతో తెలుగుగంగ కుడికాలువతో పాటు పెండింగ్‌లో ఉన్న ఎడమ కాలువ పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ పను లు పూర్తి అయితే బద్వేలు ప్రాంతంలో 30వేల ఎకరాలకు సమృద్ధిగా సాగునీరు అందు తుందని చెప్పారు. అయితే ఇప్పటికీ ఆ పనులు పూర్తి కాలేదు. సాగునీరు అందే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో ఆయా ప్రాంతాల ఆయ కట్టు రైతులు తీవ్ర అసంతృప్తికి గురవుతు న్నారు. అంతే కాదు రూ.36కోట్లతో బ్రహ్మంసాగర్ ఎడమ కాలువలో 3 ఎత్తిపోతల పథకాలను నిర్మించి ఇటుకలపాడు, సావిశెట్టిపల్లె, వరికుంట్ల, గంగనపల్లె ప్రాంతాలకు 3 వేల ఎకరాలకు సాగునీరు అందించడం జరుగుతుందని తెలిపారు. అయితే రైతాంగానికి ప్రయోజనం కల్పించే స్థాయిలో చేరలేదు.

బ్రిడ్జి పనుల మాటేంటి....?

బద్వేలు నియోజకవర్గంలోని అట్లూరు మండలంలో అనేక గ్రామాల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే ప్రయాణం సాగించాలంటే తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. ఇక మీదట అలాంటి తిప్పలు లేకుండా రూ.22 కోట్లతో వేములూరు వద్ద వంతెన నిర్మిస్తామని.. 30 గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం కలుగు తుందని చెప్పారు. అయితే ఇప్పటికే ఆ బ్రిడ్జికి మోక్షం లేకపోవడంతో ఆ గ్రామాల ప్రజల తీరని కోరికగా మిగిలింది.

ముంపులోనే నేతల హామీ

ముఖ్యమంత్రి హామీలే ముందుకు సాగని పరిస్థితులలో ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఇచ్చిన హామీల పరిస్థితి ఎలా ఉందో ఒక్కసారి పరిశీలిస్తే..

నాలుగేళ్లక్రితం కడప ఎంపీ అవినాష్ రెడ్డి, ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, అప్పటి ఎమ్మెల్యే వెంకట సుబ్బయ్య, సోమశిల ప్రాంతాలైన అట్లూరు మండలంలోని చింతావాండ్లపల్లె, ఆకుతోటపల్లె, వరికుంటపల్లె అగ్రహారం, చలంగారిపల్లె భూములు ముంపునకు గురికావడంతో అక్కడికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ముంపు భూముల కు, ఇళ్లకు 3 నెలలలో పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చి నా.. ఇప్పటి వర కు ఆ హామీ నెరవేరలేదు. దీంతో ముంపు వాసుల సమస్య, నగిలేటి బ్రిడ్జి నిర్మాణం, తెలు గుగంగ కాలువల పరిష్కారం కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. అధికారంలో ఉండి ఆ పార్టీ నాయకులు ఇచ్చిన హామీలకే దిక్కులేకపోతే మా సమస్యను పరిష్కరించేదెవరు అంటూ బాధిత గ్రామాల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల వేళ ఓటు అడిగేందుకు వెళ్లాలంటే వైసీపీ నేతలు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి.


అట్లూరు మండంలంలో ముంపునకు గురైన ఆకుతోటపల్లె గ్రామం


అసంపూర్తిగా ఉన్న తెలుగు గంగ కాలువ

సైకిల్ గుర్తు లేకుండా ఎన్నికలు



బద్వేలుటౌన్, ఏప్రిల్ 26 : నందమూరి తారాక రామారావు 1983లో తెలుగుదేశం పార్టీని స్థాపించినప్పటి నుంచి బద్వేలులో ప్రతి ఎన్నికల్లో టీడీపీ పోటీ చేస్తూ వస్తోంది. అయితే ఈ సారి సైకిల్ గుర్తు లేకుండానే బద్వేలు, జమ్మలమడుగుల్లో ఎన్నికలు జరగ నున్నాయి. బిజివేముల వీరారెడ్డి బతికి ఉన్నంత వరకు బద్వేలులో తెలుగుదేశంపార్టీకి బద్వేలు అడ్డాగా ఉండేది. వీరారెడ్డి మరణానంతరం ఆయన వారసురాలైన కొండ్రెడ్డి విజయమ్మ రాజకీయ రంగప్రవేశం చేసి 2001లో జరిగిన ఉపఎన్నికల్లో మంచి మెజార్టీతో గెలుపొందారు. అనంతరం నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా బద్వేలును 2009లో ఎస్సీ రిజర్వ్ అయినప్పటి నుంచి 2009, 2014, 2019 ప్రతి ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీ పోటీ చేస్తుండేది. అయితే బద్వేలులో 2021లో వైసీపీ ఎమ్మెల్యే గుంతోటి వెంకటసుబ్బయ్య మృతి చెందారు. తెలుగుదేశంపార్టీ సాంప్రదాయం ప్రకారం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మృతి చెందితే ఆ నియోజకవర్గంలో పార్టీ పోటీ చేయదు. అందులో భాగంగా 2021లో ఉపఎన్నికలు జరిగాయి. అప్పుడు టీడీపీ పోటీ చేయలేదు. వైసీపీ, బీజేపీలు మాత్రమే ఎన్నికల బరిలో నిలిచాయి. ఇక పొత్తు ధర్మంగా ఈ సారి బద్వేలులో బీజేపీకి కేటాయించారు. రెండవసారి సైకిల్ గుర్తులేకుండా ఎన్నికలు జరగ నున్నాయి. అలాగే జమ్మలమడుగులో టీడీపీ ఆవిర్భావం నుంచి కూడా ప్రతి ఎన్నికల్లో పోటీ చేస్తుండేది. అయితే అక్కడ కూడా పొత్తులో భాగంగా జమ్మలమడుగు టికెట్‌ను బీజేపీకి కేటాయించడంతో జమ్మలమడుగులో తొలిసారి సైకిల్‌గుర్తు లేకుండా ఎన్నికలు జరగనున్నాయి.

తెలుసుకోండి...

భారత పౌరుడు కాని వ్యక్తి.. పోటీకి అనర్హుడు

రాజ్యాంగంలోని 84ఏ ప్రకారం భారత పౌరుడు కాని వ్యక్తి పార్లమెంటు ఎన్నికల్లో అభ్యర్థిగా పోటీ చేసేవీలు లేదు. రాజ్యాంగంలోని 173ఏ ప్రకారం శాసనసభకు ఇదే నిబంధన వర్తిస్తుంది.

- ప్రజాప్రాతినిధ్యం చట్టం 1951లోని సెక్షన్4బి ప్రకారం ఏ నియోజకవర్గంలోనూ ఓటరుగా నమోదు కాని వ్యక్తి పోటీకి అనర్హుడు.
- ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 4సీ, 4సీసీ, 4 సీసీసీ ప్రకారం ఒక రాష్ట్రానికి చెందిన వ్యక్తి మరొక రాష్ట్రంలో పోటీ చేసే వీలుంది. అయితే ఈ సెక్షన్‌ల ప్రకారం అస్సాం రాష్ట్రంలో పోటీ చేసేందుకు మాత్రం వీలు కాదు.
- జైలులో ఉన్న వ్యక్తి కాని, ఒక జైలు నుంచి మరో జైలుకు తరలుతున్న వ్యక్తి కానీ పోలీసు కస్టడీలో ఉన్న వ్యక్తి కాని ఓటు వేయడానికి వీలు లేదు.

కలగా మిగిలిన సురక్ష మంచినీటి పథకం

● అటకెక్కిన పనులు...నీటి కోసం తప్పని తిప్పలు ● జగన్ ప్రభుత్వంలో పురోగతి శూన్యం


మైదుకూరు మున్సిపల్ కార్యాలయం ఆవరణలో నిల్వ ఉంచిన తాగునీటి పైపులు

మైదుకూరు, ఏప్రిల్ 26 : అది 2019 ఫిబ్రవరి 20. టీడీపీ ప్రభుత్వం. ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ద్వారా సురక్షిత తాగునీరు అందించే దిశగా 94.69 కి.మీ పైపులైను వేసేం దుకు రూ.3.5 కోట్ల విలువైన పనులకు అప్పటి మార్కె టింగ్‌శాఖ మంత్రి ఆదినారాయణరెడ్డి, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పుట్టా సుధాకర్‌యాదవ్‌తో కలసి భూమి పూజ చేశారు. అటు తరువాత టీడీపీ ప్రభుత్వం మారి వైసీపీ ప్రభు త్వం రావడంతో పనులు నేటికీ తూతూ మంత్రంగా సాగుతున్నాయి.

తెలుగుగంగ సబ్సిడరీ రిజర్వాయర్ 2 నుంచి 8 కి.మీ ప్రధాన పైపులైను ద్వారా మున్సిపల్ పరిధిలోని కేశ లింగాయపల్లె, చిన్నయ్యగారిపల్లె, శెట్టివారిపల్లె, లింగాల దిన్నె, మహబూబ్‌నగర్ మీదుగా ఎర్రచెరువు మీదుగా మైదుకూరు పట్టణంలో ఇంటింటికి కనెక్షన్ ఇచ్చి కొళాయిల ద్వారా సురక్షిత నీటిని అందించాలనేది లక్ష్యం. 2021 మార్చి 6వ తేదీ పనులు పూర్తి కావాల్సి ఉండగా.. పనులు సక్రమంగా జరగక పోవడంతో ప్రభుత్వం 2025 మార్చి 31 వరకు కాంట్రాక్టరుకు గడువు పెంచింది. 94.69 కి.మీ పైప లైన్లు వేయాల్సి వుండగా.. ఇప్పటి వరకు కనీసం 15 కిలోమీటర్లు కూడా వేయకుండా నిర్లక్ష్యం చేశారు. రూ.3.5 కోట్ల విలువైన పనులకు ఇప్పటి వరకు రూ.2 కోట్లు బిల్లులు చెల్లించినా పనులు మాత్రం కనీసం 25 శాతం కూడా మించలేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఏదీ ఏమైనా జగన్ ప్రభుత్వంలో ఇంటింటికి కొళాయిల ద్వారా సురక్షిత తాగునీటి పథకం పనులు మందకొడిగా సాగుతున్నాయి.



తాగునీటి కోసం ట్యాంకర్ల వద్ద అవస్థలు పడుతున్న మైదుకూరు వాసులు

నోట్ దిస్ పాయింట్!



కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 26: గతంలో ఎన్నడు లేని విధంగా ఎన్నికల సంఘం ఓటర్లకు పూర్తిస్థాయి సమాచారం, సాంకేతిక సహకారం అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టింది. ఓటర్లు ఫిర్యాదులు చేసేందుకు... ప్రలోభాలు, అక్రమాలను అరికట్టేందుకు ప్రత్యేక యాప్‌లు, పోర్టల్‌లు, వెబ్‌సైట్‌లు అందుబాటులోకి తెచ్చింది. కేంద్ర ఎన్నికల సంఘం రూపొందించిన యాప్‌లను వినియోగించుకునేందుకు అధికంగా ముందుకు వస్తున్నారు. తప్పు చేసిన వారికి క్షణాల్లో శిక్ష అమలయ్యేలా రూపొందించారు.

ఓటరు సాయానికి వీహెచ్‌ఏ

ఓటర్ల సమాచారాన్ని తెలుసుకునేందుకు వీలుగా ఓటరు హెల్ప్ యాప్ (వీహెచ్‌ఏ) పేరిట ప్రత్యేక వెబ్‌సైట్‌ను ఎన్నికల సంఘం రూపొందించింది. ఇందులో ఓటు నమోదు చేసుకునేందుకు వీలుగా దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి. జాబితాలో పేర్లు ఉన్నాయా, లేదా అన్నది సులువుగా తెలుసుకోవచ్చు.

ఫిర్యాదులకు ప్రత్యేకం ఎన్‌జీఎస్

ఓటర్లు ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులు చేసేందకు నేషనల్ గ్రీవెన్స్ సర్వీసెస్ (ఎన్‌జీఎస్) పేరిట ఒక పోర్టల్ ఉంది. ఓటర్ల జాబితాకు సంబంధించిన ఫిర్యాదులు ఇందులో నమోదు చేయవచ్చు. దేశ వ్యాప్తంగా ఏ నియోజకవర్గానికి చెందిన ఫిర్యా దులైనా ఇందులో నమోదు చేయవచ్చు. రాష్ట్ర, జిల్లా నియోజకవర్గ వివరాలు పొందు పరిస్తే సంబంధిత నియోజకవర్గ అధికారులు వీటిని పరిశీలించి చర్యలు చేపడతారు.

అభ్యర్థి గురించి... కేవైసీ

మీ అభ్యర్థి గురించి తెలుసుకునేందుకు నో యువర్ కాండేట్ (కేవైసీ)పేరిట ఒక వెబ్ సైట్ ఉంది. అభ్యర్థులు నామినేషన్ సందర్భంగా దాఖలు చేసే ప్రమాణ పత్రాలు (అఫిడవిట్లు) ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు ఎన్నికల సంఘం వెబ్‌సైట్ రూపొందించింది. పోటీలో ఉన్న అభ్యర్థి ఎలాంటి వారు, వారికి నేరచరిత్ర ఏమైనా ఉందా, వారికి ఏఏ ఆస్తులు, ఎక్కడ ఉన్నాయి. స్థిర చరాస్తుల వివరాలు, బంగారు ఆభరణాల వివరాలు తెలుసుకోవచ్చు.

అక్రమాలకు చెక్ పెట్టేందుకు..సీవిజిల్



ఎన్నికల్లో ప్రలోభాలు, అక్రమాలు అరికట్టేందుకు నిర్దేశించిన యాప్ ఇది. ప్రజలు తాము గుర్తించిన అక్రమాలను సీవిజిల్ యాప్‌లో సంక్షిప్తంగా నమోదు చేయాలి. వంద నిమిషాల వ్యవధిలో అధికారులు ఆ ప్రదేశానికి చేరుకుని సమాచారం ఆధా రంగా చర్యలు తీసుకుంటారు. తీసుకున్న చర్యల గురించి ఫిర్యాదు చేసిన వ్యక్తి ఫోనుకు మెసేజ్ రూపంలో తెలుపుతారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచడం ఈ యాప్ ప్రత్యేకత.

వృద్ధులు, దివ్యాంగుల సౌలభ్యం కోసం..

వయోవృద్ధులు, దివ్యాంగుల సౌలభ్యం కోసం సాక్ష్యం యాప్ అందుబాటులోకి తెచ్చారు. పోలింగ్ కేంద్రానికి సొంతంగా రాలేని వారు ఇందులో తమ పేర్లు నమోదు చేసు కోవచ్చు. నమోదు చేసుకున్నవారిని పోలింగ్ కేంద్రానికి తీసుకువచ్చేందుకు అధికారులు రవాణా సదుపాయం కల్పిస్తారు. దివ్యాంగుల కోసం చక్రాల కుర్చీ సమకూరుస్తారు.

రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే జైలు




కొందరు అభ్యర్థులు సెంటిమెంటును రెచ్చగొడితేనే ఓట్లు పడతాయని భావించి కులం, వర్గం, ప్రాంతం పేరుతో ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారు. ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు అడ్డుకట్టు వేసేందుకు ఎన్నికల సంఘం నియమావళిలో కఠిన నిబంధనలు రూపొందించింది ఎన్నికల్లో ఎవరైనా జాతి, మత, కుల, భాషా, సమాజం పేరుతో రెచ్చగొడితే ఆర్‌పీ చట్టం 1951సెక్షన్ 125 ఐపీసీ సెక్షన్ 153ఎ ప్రకారం మూడేళ్ల జైలుశిక్ష, జరిమనా విధిస్తారు. ఓటు కోసం మద్యం డబ్బులు, ఇతర వస్తువులను తీసుకన్న వారిని కూడా నేరస్తులుగానే పరిగణిస్తారు. ఐపీసీ సెక్షన్ 171 బీ హెచ్ ప్రకారం లంచంగా పరిగణించి ఏడాది జైలుశిక్ష విధిస్తారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్ల డబ్బు, మద్యం ప్రవాహంపై నిఘా పెంచారు. నజరానాలకు లొంగిన ఓటర్లను ప్రలోభాలకు గురి చేసినా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు.

పోలింగ్ ఏజంట్లే కీలకం

ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల్లో అభ్యర్థుల తరఫున పరిశీలనకు కూర్చునే ఏజంట్ల పాత్ర అత్యంత కీలకం. అభ్యర్థులు నెలల తరబడి నిర్వహించిన ప్రచారం ఓట ర్లను ప్రసన్నం చేసుకునేందుకు పడిన కష్టానికి ఫలితం ఇచ్చేది పోలింగ్ కేంద్రమే. అటువంటి కేంద్రంలో పోలింగ్ సక్రమంగా జరుగుతుందా, లేదా అన్నది గమనించడం.. బోగస్ ఓట్లు పడకుండా ఓటు వేయడానికి వచ్చిన వారిని నిశి తంగా పరిశీలించడం ఏజంట్ల పని. గుర్తింపు పొందిన రిజిస్టర్డ్ పార్టీలు అభ్యర్థుల తరఫున ప్రాధాన్యత క్రమంలో ఏజెంట్లు పోలింగ్ కేంద్రాల్లో కూర్చుంటారు. పోలింగ్ కేంద్రాల్లో జరిగే ప్రతి కదలిక ఏజంటు నిశితంగా పరిశీలించాలి. ఏ మాత్రం అనుమానం వచ్చినా ఏజంటు తన అభ్యంతరాన్ని ప్రిసైడింగ్ అధికారికి ఫిర్యాదు చేయవచ్చు. అభ్యర్థులు తమకు ఎంతో నమ్మకెమైన వారిని ఏజెంటుగా కూర్చోబెడుతారు. ఏజంటు ఏ మాత్రం తప్పు చేసినా ఆ పార్టీ అభ్యర్థికి నష్టమే.

పులివెందులలో ఒకేఒక్కడు..!

- *16 సార్లు ఎన్నికలు ● 12 సార్లు కాంగ్రెస్ గెలుపు*
- *3 సార్లు వైసీపీ ● ఒక్కసారి స్వతంత్ర అభ్యర్థి గెలుపు*
- *ఒకసారి ఎన్నిక ఏకగ్రీవం, రెండుసార్లు ఉప ఎన్నికలు*



పులివెందుల, ఏప్రిల్ 26: పులివెందుల ముఖచిత్రంలో కాంగ్రెస్ పార్టీ హవానే కొనసాగింది. నియోజకవర్గం ప్రస్థానం మొదలైన తర్వాత మొట్టమొదటి అసెంబ్లీ ఎన్నికలు 1955లో జరిగాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు 16సార్లు ఎన్నికలు జరగ్గా.. 12 సార్లు కాంగ్రెస్ విజయం సాధించి సత్తా చాటింది. మూడుసార్లు వైసీపీ గెలుపొందగా.. ఒక్కసారి స్వతంత్య అభ్యర్థి గెలుపొందడం ఇక్కడ విశేషం.. ఇక రెండుసార్లు ఉప ఎన్నికలు జరిగాయి. కాగా, ఒకసారి ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. వివరాల్లోకెళితే....

పులివెందుల నియోజకవర్గంగా ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు 14 సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. రెండుసార్లు ఉపఎన్నికలు అనివార్యమయ్యాయి. 1955లో ప్రారంభమైన పులివెందుల మొట్ట మొదట ఆరు మండలాలతో నియోజకవర్గంగా ఏర్పడింది. 2009 ఎన్నికల సమయంలో జిల్లాలోని నియోజకవర్గాల పునర్విభజన సమయంలో లక్కిరెడ్డిపల్లె నియోజకవర్గంలో ఉన్న చక్రాయపేట మండలాన్ని పులివెందుల నియోజకవర్గంలో కలిపారు. పునర్విభజన అనంతరం 2009 అసెంబ్లీ ఎన్నికల్లో చక్రాయపేట మండ లం పులివెందుల నియోజకవర్గ ఎన్నికల్లో చోటు దక్కింది. దీంతో అప్పటి నుంచి పులివెందుల నియోజకవర్గం ఏడు మండలాలుగా కొనసాగు తోంది. ఈ నియోజక వర్గంలో పూర్తిగా ఆధిపత్యం వైఎస్ కుటుంబానిదే. అందులోను కాంగ్రెస్ పార్టీదే హవా కొనసాగుతూ వచ్చింది.

1955లో కాంగ్రెస్ పార్టీ తరఫున పెంచికల బసిరెడ్డి నుంచి కాంగ్రెస్ పార్టీ విజయ ప్రస్థానం సాగింది. కానీ 1962లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పెంచికల బసిరెడ్డిపై స్వతంత్ర అభ్యర్థి చవ్వా బాలిరెడ్డి గెలుపొందారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపొం దింది. అప్పటి నుంచి 2009 వరకు కాంగ్రెస్ పార్టీ హవా కొన సాగింది. కాంగ్రెస్ పార్టీ తరఫున పెంచికల బసి రెడ్డి మూడు పర్యాయాలు విజయం సాధించారు. 1978లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ తరఫున బరిలో దిగి గెలుపొందారు. 1983లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కాంగ్రెస్ (ఐ) తరఫున బరిలో నిలిచి గెలుపొందారు. 1983 నుంచి ఇప్పటి వరకు ప్రత్యర్థి పార్టీ టీడీపీ బరిలో నిలుస్తూ వచ్చింది. అభ్యర్థులు వేరైనా విజయం మాత్రం కాంగ్రెస్ పార్టీదే. 1991లో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున వైఎస్ పురుషోత్తమరెడ్డి గెలుపొం దారు. 2009లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మృతితో ఎన్నికలు అనివార్యమ య్యాయి. కానీ ఆ సమయంలో ఏ పార్టీ పోటీలో నిలవకపోవడంతో ఆయన సతీమణి వైఎస్ విజ యలక్ష్మి పులివెందుల ఎమ్మెల్యేగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సొంతపార్టీ స్థాపించుకున్న అనంతరం కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయడంతో పులివెందుల అసెంబ్లీకి ఉప ఎన్నికలు అనివార్యమ య్యాయి. 2011లో జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్ విజయలక్ష్మి గెలు పొందారు. 2011 నుంచి మరో రెండుసార్లు జరిగిన అసెంబ్లీ ఎన్ని కల్లో ఆ పార్టీనే గెలుపొందింది. 2019 ఎన్నికల్లో వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందుల ఎమ్మెల్యేగా గెలుపొంది రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

పులివెందుల నియోజక వర్గం నుంచి ఎన్నికైన ఇరువురు రాష్ట్ర ముఖ్యమంత్రులు కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. కాగా, ప్రస్తుతం 2024లో జరగనున్న ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇక్కడ నుంచి పోటీ చేస్తుండడం.. వైఎస్ తనయ, జగన్ సోదరి షర్మిల రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఆ పార్టీ తరఫున అభ్యర్థిని బరిలో నిలపడం.. టీడీపీ బలం పుంజుకుని పోటీ చేస్తుండడం ఆసక్తికరంగా మారింది.


పులివెందుల మొట్ట మొదటి ఎమ్మెల్యే పెంచికల బసిరెడ్డి


స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందిన చవ్వా బాలిరెడ్డి

ఎంపీ అవినాశ్‌కు చేదు అనుభవం

● సమస్యలపై నిలదీసిన అట్లూరు వాసులు


ఎంపీని సమస్యలపై నిలదీస్తున్న అట్లూరు మండలం చెండువాయి కాలనీవాసులు

అట్లూరు, ఏప్రిల్ 26 : కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డికి చేదు అనుభవం ఎదురైంది. గెలిచిన ఐదేళ్లకు మా ఊరికి మళ్లీ ఓట్లకోసం వచ్చారు.. మా సమస్యలు ఒక్కటైనా పరిష్కరించారా అని జనం నిలదీశారు. వివరాలు ఇలా..

శుక్రవారం ఎంపీ అవినాశ్‌రెడ్డి, బద్వేలు ఎమ్మెల్యే అభ్యర్థి సుధతో కలసి అట్లూరు మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రెడ్డిపల్లె క్రాస్‌రోడ్డు, చెండువాయి కాలనీ, ఉప్పుటూరు కాలనీ, మద్దూరు, వరికుంట కాలనీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో ప్రజలు సమస్యలపై ఎంపీని నిలదీశారు. మీకు ఓట్లు వేసి గెలిపిస్తే ఐదేళ్లకు మళ్లీ ఓట్లకు మాత్రమే వచ్చారన్నారు. తమ సమస్యలు స్థానికంగా ఏ వైసీపీ నాయకుడు పట్టించుకోలేదన్నారు. తాగునీటి పైపులైను లేదని, కరంటు వైర్లు పాతబడి తెగిపోతున్నాయని, డ్రైనేజీలు లేవని, సిమెంటు రోడ్లు, వీధిలైట్లు లేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ముంపు గ్రామాలైన చింతవాళ్లపల్లె, ఆకుతోటపల్లె, చలంగారిపల్లె, ఆగ్రహారం గ్రామాల భూములకు, ఇళ్లకు మూడు నెలల్లోనే పరిహారం చెల్లిస్తామంటూ 2020లో ఎంపీ, ఎమ్మెల్సీ, అప్పటి ఎమ్మెల్యే మాట ఇచ్చారన్నారు. ఇప్పటికీ ఆ వాగ్దానం నెరవేర్చ లేదన్నారు. స్థానిక వైసీపీ నాయకులు సర్దిచెప్పే ప్రయత్నం చేయగా.. ఈ రోజైనా మాకాలనీ సమస్యలు తీర్చారా అంటూ నిలదీశారు. దీంతో వైసీపీ నాయకులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాగా.. ఎంపీ పర్యటనకు జనాన్ని తరలించేందుకు రావాలంటూ వైసీపీ నాయకులు అట్లూరు బీసీ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ కుంభగిరి క్రిష్ణను పిలి చారు. తనకు ఆరోగ్యం బాగోలేదని రాలేనని ఆయన చెప్పారు. దీంతో వైసీపీ నాయ కులు దుర్భాషలాడటంతో బాధితుడు అట్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అంతన్నాడు.. ఇంతన్నాడు.. అమాంతం ముంచేశాడు

● మద్యనిషేధాస్త్రంతో మహిళలకు శఠగోపం ● దశలవారీగా నిషేధం అంటూ మద్యం రేట్లు పెంచి లక్షల కోట్లు దోపిడీ ● రోజు కూలిలో సగం మద్యానికి ఖర్చు చేస్తున్న పురుషులు ● పూటగడవక భర్తలతో భార్యల గొడవలు ● పేదింట పైసల కొట్లాటకు కారణమైన వైసీపీ ప్రభుత్వం ● టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ధ్వజం

'కీలెరిగి వాత పెట్టడంలో జగన్‌కు జగనే సాటి.. మహిళల బలహీనతను కనిపెట్టి మద్యనిషేధం పేరు చెప్పి సీఎం సీటెక్కి దెబ్బకొట్టాడు. ఆడపడుచులకు ఎంతో చేస్తానని నమ్మబలికాడు.. పేదజనం జీవితం ఆర్థికంగా బాగుపడాలంటే ఇంతకంటే ఏమీ కావాలి.. అందులో నూ ఈ మాట చెప్పేది ఎవరో కాదు కదా... సాక్షాత్తూ మన రాజన్న బిడ్డే అనుకున్నారు.. పైగా మాట తప్పడం, మడమ తిప్పడం మా వంశంలోనే లేదన్నాడు.. మద్యాన్ని దశలవారీగా నియంత్రిస్తూ ఫైవ్‌స్టార్ హోటళ్లకే పరిమితం చేస్తానన్నాడు. ఇన్ని మాయమాటలతో గద్దెనెక్కి పేదలకు చుక్కలు చూపించాడు.' అంటూ టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి ధ్వజమెత్తారు. జగన్ నిర్వాకంతో ఏ ఇంటికెళ్లినా ఏడుపులేగాని సంతోషం లేదన్నారు. ఇంత మాయలోడిని ఎన్నడూ చూడలేదని ప్రతి ఒక్కరూ పేర్కొంటున్నారని తెలిపారు.



ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి



టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి



మహిళల సమస్యలు వింటున్న టీడీపీ కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి



కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 26: దశల వారీ మద్యనిషేధం అని 2019 ఎన్నికలముందు చెప్పి 2024 నాటికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.లక్షల కోట్లు దోపిడీ చేశారని టీడీపీ కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ధ్వజమెత్తారు.. శుక్రవారం కడప నగరం 50వ డివిజను కొట్టాలు, హరిజనవాడలో ఎన్నికల ప్రచారం చేశారు. ఇం టింటికీ వెళ్లి టీడీపీ కరపత్రాలను అందించారు. అలాగే టీడీపీ అధికారంలోకి వచ్చాక చేపట్టబోయే సంక్షేమం, అబివృద్ధికి సంబంధించి వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ డీఅడక్షన్ సెంటర్ల పేరుతో హడావుడి తప్ప ఒక్కటీ కూడా ఇంత వరకు ప్రారంబించలేద న్నారు. మద్యం షాపుల్లో నగదు లావాదేవీఆలు మాత్రమే జరుపుతూ వేలకోట్ల ప్రజాధనం పక్కదారి పట్టించారన్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి మద్యం బ్లాక్‌మార్కెట్ అమ్మకాలు జరుగుతున్నాయన్నారు. బ్లాక్ మార్కెట్ డబ్బు రూ.లక్షల కోట్లు తాడేపల్లి ప్యాలెస్‌కు చేరుతుందనేది నిజం కాదా అని ప్రశ్నించారు. నాశిరకం మద్యంతో 35 లక్షల మంది అమాయకులు ఆసుపత్రిపాలయ్యారన్నారు. 30వేల మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. 2019 నుంచి రాష్ట్రంలో లివర్‌ఫోరోసిస్ వ్యాధి బాధితులు పెరగడానికి జగన్‌రెడ్డి కల్తీ మద్యమే కారణమన్నారు. ఇదంతా ఏపీ బేవరేజస్ కార్పోరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి కనుసన్నల్లోనే రాష్ట్రంలో మద్యం మాఫియా అరాచకం నడుస్తుందన్నారు. టీడీపీ పాలనలో మద్యం అమ్మకాలు 72వేల కోట్లు ఉంటే, జగన్‌రెడ్డి పాలనలో 1.31 లక్షల కోట్లు చేరిందన్నారు. బ్లాక్ మార్కెట్ ద్వారా తాడేపల్లి ప్యాలెస్ కొట్టేసింది లక్ష కోట్లు అని ఆరోపించారు. దశల వారీ మద్యం నిషేధమన్నప్పుడు రాష్ట్రంలో ఎక్సైజ్, వ్యాట్ ఆదాయం క్రమంగా తగ్గాల్సింది పోయి పెరగడం ఏ విధమైన నిషేధమని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వానికి పన్నుల రూపంలో 2019-20లో 17300 కోట్లు, 2020-21లో 21,500 కోట్లు, 2021-22లో 26700 కోట్లు, 22-23లో 30600 కోట్లు, 23-24లో 35వేల కోట్లు మొత్తం 1.31 లక్షల కోట్లకు పైగానే అధికారికంగా మద్యం అమ్మకాలు జరిగాయన్నారు. అనదికారికంగా బ్లాక్‌మార్కెట్లో మరో లక్ష కోట్లు విలువైన మద్యం అమ్మకాలు చేసి ఆ మొత్తాన్ని తాడేపల్లి ప్యాలెస్ దోచుకుందని ఆరోపించారు. అంతేకాకుండా నిబంధనలకు విరుద్ధంగా మద్యసం ఆదాయాన్ని బ్యాంకులకు తాకట్టుపెట్టి బేవరేజెస్ కార్పోరేషన్ ద్వార 20 సంవత్సరాల్లో తిరిగి చెల్లించే విధంగా 40వేల కోట్లు అప్పు తెచ్చారన్నారు. మద్యం నిషేధం హామీపై మాట తప్పి మడమ తిప్పి పేదలకు నమ్మకద్రోహం చేశారన్నారు. కల్తీమద్యం, అధిక ధరలకారణంగా నాటుసారా అమ్మకాలు జోరందుకున్నాయన్నారు. నాలుగు లక్షల బెల్టు, మొబైల్‌షాపులు నడుపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు యువరాజ్, నవీన్, రాజా, చంద్ర, పవన్, సుబ్బుతో పాటు అధిక సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.

టీడీపీలో యువత భారీ సంఖ్యలో చేరిక

కడప నగరం 7వ డివిజన్ శంకరాపురంలో టీడీపీ నాయకులు అహ్మద్ బాషా, వంశీయాదవ్, వసంత్‌యాదవ్, తిరుమల ప్రసాద్‌యాదవ్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో యువత టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికిటీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో, జిల్లాలో వైసీపీ నాయకులు చేస్తున్న దౌర్జన్యాలు, దోపిడీ అరికడతామన్నారు. రానున్నది టీడీపీ ప్రభుత్వమని చంద్రబాబు సీఎం కావడం ఖాయమన్నారు. పార్టీ విజయానికి ప్రతి ఒక్క కార్యకర్త ఒక సైనికుడులా పనిచేయాలని పిలుపునిచ్చారు. అధికారంలోకి వచ్చాక పనిచేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పోరేటరు రాజగోపాల్‌రెడ్డి, చినబాబు, నాయకులు అశోక్, టింబర్‌డిపో శ్రీను, రాంప్రసాద్‌రెడ్డ, శ్రీను, బొమ్మిశెట్టి చంద్రశేఖర్, జయంత్, జిలానీబాషా, రవిశంకర్, జనసేన నాయకులు తుంగ రమణయ్య, విజయ్‌తోపాటు అధిక సంఖ్యలో స్థానిక నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



శ్రీనివాసరెడ్డి దంపతులకు హారతిపడుతున్న దృశ్యం

ప్రజలకు అందుబాటులో ఉన్న వారికే ఓటేయండి

● పులివెందుల, కమలాపురం నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే అభ్యర్థులు, వారి బంధువుల ఎన్నికల ప్రచారం

పెండ్లిమర్రి, ఏప్రిల్ 26:నిత్యం ప్రజలకు అందుబాటులో ఉన్నవారికే ఓటేయాలని పుత్తా నరసింహారెడ్డి సతీమణి సరళమ్మ, కోడలు శ్రీచైతన్య, చెల్లెలు యశోదమ్మ పేర్కొన్నారు. శుక్రవారం వారు నల్లయ్యగారిపల్లె, బాలయ్యగారిపల్లె, రామచంద్రాపురం, ఇందిరానగర్, గొందిపల్లె, ఎస్సీకాలనీలలో ప్రచారం నిర్వహించారు.

టీడీపీని ఆదరించండి

వల్లూరు, ఏప్రిల్ 26: టీడీపీని ఆదరించాలని పుత్తా నరసింహారెడ్డి సోదరుడి కుమారుడు సాయి నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం గోటూరు గ్రామ పంచాయతీలో ఎన్నికల ప్రచారం నిర్వమించారు.

బీటెక్ రవిని గెలిపించండి

సింహాద్రిపురం, ఏప్రిల్ 26:పులివెందుల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీటెక్ రవిని గెలిపించాలని బీటెక్ రవి సోదరుడు మారెడ్డి జయభరత్‌రెడ్డి, బీటెక్ రవి కుమారుడు మారెడ్డి రామ్‌రెడ్డి ఓటర్లను కోరారు. శుక్రవారం మండలంలోని దుద్దెకుంట్లలో మడ, కడపనాగయ్యపల్లి గ్రామాల్లో వారు ప్రచారం నిర్వహించారు.

జిల్లాలో కూటమికి ఏకపక్షం: కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 26 : వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులకు ఏకపక్ష ఓటింగ్ జరగనుందని టీ డీపీ నేతలు గోపిశెట్టి నాగరాజు, గంధం ప్ర సాద్, అమీర్ పేర్కొన్నారు. శుక్రవారం హరిటవర్స్‌లో వారు విలేకరులతో మాట్లాడారు.

వైసీపీకి ఓటు వేస్తే మునిగిపోయినట్టే

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మైనార్టీల ద్రోహి అని, ఆ పార్టీకి ఓటు వేస్తే మునిగిపోయినట్టేనని టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శి మంజూరు అహ్మద్ అన్నారు. శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా చెన్నూరు మైనార్టీ కాలనీ మూడో వార్డులో ఇంటింటికీ వెళ్లి టీడీపీ మేనిఫెస్టోను వివరించారు.

మాజీ ఉప సర్పంచ్‌కి పుత్తా పరామర్శ

ముండ్లపల్లెకు చెందిన మాజీ ఉప సర్పంచ్ సయ్యద్ అబ్దుల్లా రెండురోజుల క్రితం అనారోగ్యానికి గురై ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతుండడంతో ఆయన్ను పుత్తా నరసింహారెడ్డి వెళ్లి పరామర్శించారు.

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

వేంపల్లె, ఏప్రిల్ 26: మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడితోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని టీడీపీ నాయకులు రవితేజరెడ్డి, రఘునాథరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని రాజారెడ్డి నగర్, శ్రీరామ్‌నగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

20 కుటుంబాలు టీడీపీలో చేరిక

వీరపునాయునిపల్లె, ఏప్రిల్ 26: మండలంలోని అడవిచెర్లోపల్లెలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో భాగంగా బైరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి అధ్యక్షతన బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గండి ఓబయ్యయాదవ్, అడవిచెర్లోపల్లె గంగిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొమ్మద్దిలో పది కుటుంబాలు, అడవిచెర్లోపల్లె పది కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు.

పుత్తా సమక్షంలో టీడీపీలో చేరిక

చెన్నూరు, ఏప్రిల్ 26 : టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి సమక్షంలో రాచిన్నాయపల్లె నేత ఈశ్వరయ్య వర్గీయులు చిన్నా, రామిరెడ్డి తదితరులు టీడీపీలో చేరగా వారిని పుత్తా పార్టీలోకి ఆహ్వానించారు.

కూటమి అభ్యర్థులను ఆదరించండి





కొండాపురం పట్టణంలో ప్రచారం నిర్వహిస్తున్న దేవగుడి శివనారాయణరెడ్డి, పెద్దముడియంలో పార్టీలో చేరిన వారితో ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి

కొండాపురం, ఏప్రిల్ 26 : రాబోయే ఎన్నికల్లో ఎన్డీయే కూటమి తరపున జమ్మలమడుగు ఎమ్మెల్యేగా ఆదినారాయణరెడ్డిని, కడప ఎంపీగా భూపేశ్‌రెడ్డిలను భారీ మెజారిటీతో గెలిపించాలని మండల బీజేపీ ఇన్‌చార్జి దేవగుడి శివనారాయణరెడ్డి కోరారు.కొండాపురం పట్టణంలో శుక్రవారం ఆయన ఇంటింటికి ప్రచారం నిర్వహించారు.

పెద్దముడియం.. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి తరపున నిలబడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డి విస్తృత ప్రచారం చేశారు. మండల పరిధిలోని చిన్నపసుపుల గ్రామంలో శుక్రవారం 15 కుటుంబాలు ఎన్‌డీఏ కూటమిలో చేరాయి. గ్రామానికి చెందిన కుమార్‌రెడ్డి, రాజారెడ్డి, మరికొంత మంది నాయకులు, కార్యకర్తలను కండువాలు కప్పి ఆది నారాయణరెడ్డి, భూపేష్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల..: రాబోయే ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం వస్తేనే అభివృద్ధి జరుగుతుందని జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి సతీమణి అరుణ పేర్కొన్నారు. శుక్రవారం ఎర్రగుంట్ల నగర పంచాయతీలోని 10వ వార్డులో ఆమె స్థానిక నాయకులతో కలిసి విస్తృతంగా ప్రచారం నిర్వమించారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వాలు వచ్చేందుకు ఎన్డీయే ఎమ్మెల్యే అభ్యర్థి సి.ఆదినారాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డిని అత్యధిక ఓట్లతో గెలిపించాలని అరుణ అ భ్యర్థించారు. ఇంటింటికి కరపత్రాలు ఇస్తూ ఓటర్లను కలిచారు. సీతమ్మ, సంధ్యారాణి, రమాదేవి, జనసేన నాయకుడు జగదీష్, స్థానిక నాయకులు జగన్ మోహన్‌రెడ్డి, మల్లుగోపాల్‌రెడ్డి, కత్తిప్రతాప్‌రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో యువకుడు మృతి

కమలాపురం రూరల్, ఏప్రిల్ 26 :మండల పరిధిలోని పెద్దచెప్పలి గ్రామానికి చెందిన అన్వర్‌బాషా (35) అనే యువకుడు శుక్రవారం ఉదయం విద్యుద్ఘాతానికి గురై మృతి చెందాడు. స్తానిక పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు అన్వర్‌బాషా పెద్దచెప్పలిగ్రామంలో పంక్చర్ బంకు ఏర్పాటు చేసుకుని జీవనం సాగించాలని శుక్రవారం ఉదయం రోజువారిగా పంక్చర్ బంకు ఓపెన్ చేస్తుండగా ఉన్నపళగా విద్యుత్ షాక్ కు గురయ్యాడు. స్తానికులు హుటాహుటిన ప్రభుత్వ వాహనంలో ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారని, కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు.

'జగన్‌ను సాగనంపేందుకు సిద్ధం'

కడప (మారుతీనగర్), ఏప్రిల్ 26: ప్రతి ఏటా జనవరి 1న జాబ్ కేలండర్ విడుదల చేస్తానని, రాష్ట్రంలోని 40 లక్షల మంది నిరుద్యోగులను మోసం చేసిన ముఖ్యమంత్రి జగన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో ఓడించి ఇంటికి సాగనంపేందుకు అందరూ సిద్ధంగా ఉన్నారని టీడీపీ, టీఎన్‌ఎస్‌ఎఫ్, నిరుద్యోగ జేఏసీ, రాష్ట్ర నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు.

బంగారు స్వాధీనం

కడప (క్రైం), ఏప్రిల్ 26 : కడప నగరం భాగ్యనగర్ కాలనీలో చోరీ చేసిన కేసులో ముగ్గురు బాలురను అరెస్టు చేసి వారి నుంచి బంగారు స్వాధీనం చేసుకున్నట్లు చిన్నచౌకు సీఐ నరసింహారెడ్డి తెలిపారు. సీఐ వివరాల మేరకు... భాగ్యనగర్‌కు చెందిన ఉపాధ్యాయుడి ఇంట్లో రెండు నెలల క్రితం చోరీ జరిగింది. ఫిర్యాదు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. శుక్రవారం పాత బైపాస్ రోడ్డు వద్ద ముగ్గురు బాలురను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 62.300 గ్రాముల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో ఎస్‌ఐలు రవికుమార్, మహ్మద్‌రఫి ఉన్నట్లు తెలిపారు.


పుష్పగిరిని దర్శించుకున్న దేవదాయ శాఖ కమిషనర్

వల్లూరు, ఏప్రిల్ 26 : ప్రముఖ పుణ్యక్షేత్రమైన పుష్పగిరిలో కొలువుదీరిన కామాక్షి సమేతవైద్యనాదేశ్వరస్వామి క్షేత్రాన్ని దేవదాయశాఖ కమిషనర్ సత్యనారయణ, జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్‌లు శుక్రవారం దర్శించుకున్నారు. వీరి రాక సందర్భంగా ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వైద్యనాదేశ్వరస్వామికి, శ్రీచక్రసమేత కామాక్షి అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం పుష్పగిరిలోని శంకరాచార్య మఠం కూడా సందర్శించారు. అనంతరం గుడి అంతా కలియదిరిగారు. గుడి ప్రాముఖ్యతను పరిశీలించారు. వీరివెంట డిప్యూటీ కమిషనరు గురుప్రసాద్, ఆలయ ఈవో శ్రీనివాసులు, అనువంశిక ధర్మకర్త వెంకటసుబ్బారెడ్డి, అసిస్టెంటు కమిషనర్ శంకరబాలాజీ, ఆలయ అర్చకులు, పురావస్తుశాఖ, ఎండోమెంటు సిబ్బంది వీరివెంట ఉన్నారు.

ఇంటర్న్‌షిప్‌లోనే వంద శాతం ఉద్యోగ అవకాశాలు

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 26 : అప్లైడ్ ఆర్ట్స్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లోనే వంద శాతం ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు అంజనేయ ప్రసాద్ తెలిపారు. గురువారం అనువర్తిత కళాశాల వార్షిక ప్రదర్శనకు ఆయన హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రియేట్ చేసిన బ్రాండింగ్ డిజన్స్‌ను పరిశీలించిన తరువాత యువకులుగా వారి ఆలోచనల్లో క్రియేటివిటీకి ఉపయోగించిన వారు మరింత అద్భుతంగా డిజైన్లు సృష్టించారన్నారు. ఇంటర్న్‌షిప్ పూర్తి అవగానే 80 శాతం మంది విద్యార్థులకు ఉద్యోగావకాశాలు రావడం ఆనందంగా ఉందన్నారు.

శతాధిక వృద్ధురాలు లక్ష్మీనరసమ్మ మృతి



ప్రొద్దుటూరు, ఏప్రిల్ 26: ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన శతాధిక వృద్ధురాలు దేవనేని లక్ష్మీనరసమ్మ శుక్రవారం తెల్లవారుజామున తీవ్ర ఎండలకు తుది శ్వాస విడిచారు. ఆమె మరణించేంత వరకు తన పనులు తానే చేసు కుంటూ ఉండేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఉపా ధ్యాయుడైన ఈమె భర్త దేవనేని పార్థసారధి 1958లో మ రణించారు. అప్పటినుంచి ఈమె భర్త పెన్షన్ తీసుకుం టున్నారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత దేవనేని ప్రభాకర్ ఈమె కుమారుడే. ఈమెకు 18 మంది మనుమళ్లు, 39 మంది మునిమనుమళ్లు ఉన్నారు.

29 నుంచి చిత్ర శిల్ప కళా ప్రదర్శన: వీసీ

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 26 : వైవీయూలో ఈ నెల 29 నుంచి చిత్ర శిల్ప కళ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు వీసీ సుధాకర్ తెలిపారు. లలిత కళల విభాగం నాలుగో సంవత్సరం విద్యార్థులు సృష్టించిన చిత్రాలు, శిల్ప కళను విడుదల చేశారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న ట్రస్టు డైరెక్టరు లేవాకు లక్ష్మీరెడ్డి, వైస్ చైర్మన్ నితీష్‌కుమార్‌రెడ్డి నారపురెడ్డి ట్రస్టు ప్రతినిధులు

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 26: కడప నగరం రామచంద్రాపురం నివాసి లేవాకు లక్ష్మీరెడ్డి బుధవారం బిల్టప్ సర్కిల్‌లో చలివేంద్రం ప్రారంభించారు. గత 18 సంవత్సరల నుంచి కడప నగరంలో వేసవి కాలంలో ఉచిత మంచినీటి చలివేంద్రాలు నిర్వహించడం గమనార్హం. 2006 సంవత్సరంలో ఒక్క చలివేంద్రంతోప్రారంభించి ప్రస్తు తం 22 చలివేంద్రాలకు చేరింది. ఈ సందర్భంగా ట్రస్టు డైరెక్టరు లేవాకు లక్ష్మీరెడ్డి మాట్లాడుతూ ప్రతి వేసవిలో వంద రోజులపాటు ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు నిర్వహిస్తున్నామన్నారు. ఎవరికైనా నీటి సమస్య ఉంటే 9490034441కు కాల్‌చేస్తే వెంటనే ఉచితంగా ట్యాంకరు పంపిస్తామని వైస్ చైర్మన్ నితీష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. లేవాకు రఘునాథరెడ్డి, అనిల్‌రెడ్డి, శివ, రమణ, వేమయ్య, రాజశేఖరరెడ్డి, ఓబులేసు పాల్గొన్నారు.

'ఎంపీడీఓ కార్యాలయ ఏఓపై చర్యలు తీసుకోవాలి'

కమలాపురం రూరల్, ఏప్రిల్ 26 : పెండ్లిమర్రి మండలం ఎంపీడీవో కార్యాలయ ఏవోగా పనిచేస్తున్న సుల్తాన్‌హుసేన్‌పై చర్యలు తీసుకోవాలని ఆర్వో గణేశ్‌కుమార్‌కు వినతిపత్రం అందించినట్లు పెండ్లిమర్రి మండలం కన్వీనరు గంగిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సుల్తానా హుసేన్ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ తన కార్యాలయంలో నవరత్నాలకు సంబంధించిన వాల్‌పోస్టులను ఏర్పాటు చేశారన్నారు. ఎన్నికల సమయంలో ఇలాంటి పోస్టులు పెట్టకూడదని చెప్పగా, అది నా ఇష్టమని నా సొంత నిధులతో ఏర్పాటు చేసుకున్నానని, నీవుఎవరు నన్ను అడిగేదంటూ నాపై దురుసుగా ప్రవర్తించాడన్నారు. అదేవిధంగా సచివాలయంలో పంచాయతీకార్యదర్శిగా నిచేస్తు న్న సుధాకర్ 24న ఎన్నికలకోడ్ ఉల్లంఘిస్తూ పంచాయతీ కార్యాలయంలో వైసీపీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారని ఇది కోడ్ ఉల్లంఘన కిందకే వస్తుందన్నారు. కావున ఆ ఇద్దరిపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని ఆర్వోకు వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు.

ఎన్నికల్ కోడ్‌కు తూట్లు

పెండ్లిమర్రి, ఏప్రిల్ 26: మండలంలోని నందిమండలం గ్రామంలో విద్యుత్ సిబ్బందితో ఎన్నికల కోడ్‌కు తూట్లు పొడుస్తున్నారని టీడీపీ నేతలు ఆరోపించారు. ఎప్పటి నుంచో గ్రామంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేయాల్సి ఉండగా వైసీపీ నేతలు ఒత్తిడితో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా గురువారం చావిడి వద్ద వాటర్‌ప్లాంట్ వద్ద రెండు విద్యుత్ స్తంభాలను ఏర్పాటుచేశారన్నారు. షిఫ్టింగ్ చార్జీలు కట్టకుండా విద్యుత్ స్తంభాల ఏర్పాటుచేశారన్నారు. నందిమండలం సబ్‌స్టేషన్ ఇన్‌చార్జిని వివరణకోరగా తన దృష్టికి రాలేదని తెలిపారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ఫలితాల్లో 45 మంది ఖైదీలు ఉత్తీర్ణత

కడప (క్రైం), ఏప్రిల్ 26 : కడప కేంద్ర కారాగారంలో 2023-24 సంవత్సరం సంబంధించి దూరవిద్య ఆధ్వర్యంలో నిర్వహించిన పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో ఓపెన్ టెన్త్‌లో 45 మంది, ఇంటర్‌లో 16 మంది ఉత్తీర్ణులు అయినట్లు కేంద్ర కారాగారం పర్యవేక్షణ అధికారి ప్రకాశ్ పేర్కొన్నారు. అలాగే 2024-25 సంబంధించి పరీక్షలకు ఖైదీలు సిద్ధమవుతున్నారన్నారు.

మూడు నామినేషన్లు తిరస్కరణ


పులివెందుల, ఏప్రిల్ 26: పులివెందుల అసెంబ్లీ స్థానానికి నామినేషన్ దాఖలు చేసిన ముగ్గురు అభ్యర్థుల నామినేషన్‌లను తిరస్కరించినట్లు ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయ అధికారులు తెలిపారు. పులివెందులలో మొత్తం 33 మంది నామినేషన్లు దాఖలు చేయగా అందులో ముగ్గురివి తిరస్కరణకు గురికావడంతో 30 మంది పోటీలు ఉన్నట్లు తెలిపారు. తిరస్కరణకు గురైన వారిలో పుల్లగూర సాయికుమార్ (లోక్‌తంత్రిక్ జనతాదల్), వంగల వెంకట శివ లక్ష్మి (జై హిందుస్థాన్ పార్టీ), ఎ.వెంకటలక్ష్మిరెడ్డి (ఇండిపెండెంట్)లు ఉన్నారు.

కమలాపురంలో...

కమలాపురం రూరల్, ఏప్రిల్ 26: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నిర్వహించిన నామినేషన్ ప్రక్రియ పూర్తవడంతో శుక్రవారం నామినేషన్ పరిశీల కార్యక్రమం చేపట్టారు. మొత్తం 24 మంది నామినేషన్లు వేయగా వారిలో 11 మందివి ఆమోదించారు. వివిధ కారణాలతో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, వైసీపీ నాయకుడు నరేన్ రామాంజులరెడ్డితో పాటు మరో 11 మంది నామినేషన్లను తిరస్కరించారు.

దారి బాగు చేయండి మహాప్రభో

● ఎస్టీ రామపురం కాలనీ, కైలాసగిరికోన గిరిజనుల వినతి



కంకర తేలిన ఎస్టీ రామాపురం కాలనీకి వెళ్లే రోడ్డు

చెన్నూరు, ఏప్రిల్ 26 : తమ కాలనీలకు వెళ్లే దారి పాడైపోయిందని, బాగు చేయాలని చెన్నూరు మండలంలోని మలసింగాయపల్లె పరిధిలోకి వ చ్చే ఎస్టీ రామపురం కా లనీ, కైలాసగిరికోన గిరిజనులు విన్నవిస్తున్నారు. జగన్ కాలనీకి ట్రిప్పర్లతో కంకర, ఇసుక, సిమెంట్, ఇనుపకడ్డీలు తోలుతూ దారినంతా పాడు చేశారని తెలిపారు. రెండు సంవత్సరాల క్రితం కనుపర్తి ప్రాంత పరిధిలో ఇంటి స్థలాలు కేటాంచారని, అక్కడ నిర్మాణాల కోసం అవసరమైన సామగ్రిని అధిక లోడ్‌తో తరలించడంతో ఆ ట్రిప్పర్లు తిరిగే గిరిజన కాలనీకి వెళ్లే తారు రోడ్డు రెండు కిలోమీటర్లకు పైగా ధ్వంసమైంది. అధిక బరువుతో ట్రిప్పర్లు తిరగడంతో రోడ్డుపై తారు దాని కింద పరచిన కంకర మొత్తం లేచిపోయి నడిచేందుకు కూడా ఇబ్బంది పడాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. దీంతో గిరిజనులు ఈ జగనన్నకు ఓటు వేసి మాకేదో మేలు చేస్తాడు అనుకుంటే ఉన్న రోడ్డును కూడా పాడైందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రొద్దుటూరులో టీడీపీ జెండాను ఎగురవేస్తాం




ప్రొద్దుటూరులో టీడీపీ కార్యాలయం ప్రారంభిస్తున్న నేతలు శ్రీనివాసరెడ్డి, వరద, ప్రవీణ్‌రెడ్డి, ప్రచారంలో పాల్గొన్న వరదరాజులరెడ్డి కుమార్తెలు, మనుమరాళ్ళు

ప్రొద్దుటూరు ఏప్రిల్ 26 : ప్రొద్దుటూరులో టీడీపీ జెండాను ఎగురవేస్తాం అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, వరదరాజులరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఒన్‌టౌన్ ఏరియాలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు వైఎస్ జబీవుల్లా ఆధ్వర్యంలో టీడీపీకార్యాలయం ఏర్పాటు చేశారు. ఈ కార్యాలయాన్ని టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి వరదరాజులరెడ్డిలు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీలో వుండే అందరం కలిసికట్టుగా పనిచేసి ప్రొద్దుటూరులో జెండా జెగురవేస్తామని తెలిపారు. రాష్ట్రంలో వైసీపీ అరాచకపాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడటానికి చంద్రబాబును ముఖ్యమంత్రి గా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొండారెడ్డి, రాఘవరెడ్డి, సర్పంచ్ శివచంద్రారెడ్డి, కౌన్సిలర్లు వంగనూరు మురళీధర్‌రెడ్డి, మహ్మద్ గౌస్, చల్లారాజగోపాల్ యాదవ్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో మార్పుకోసం ఓటును అస్త్రం గా మార్చుకోండి

ప్రొద్దుటూరు,ఏప్రిల్ 26 : రాష్ట్రంలో వైసీపీ అరాచకపాలన నుంచి ప్రజలకు విముక్తి కావాలంటే మార్పు కోసం ఓటును అస్త్రంగా మార్చుకుని టీడీపీ ప్రభుత్వాన్ని తెచ్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక 28 వవార్డులో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా టీడీపీ సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసంరఘురామిరెడ్డి, మాజీ ఇన్‌చార్జ్ చైర్మన్ వీఎస్ ముక్తియార్, కొత్తపల్లె సర్పంచ్ శివచంద్రా రెడ్డి, కౌన్సిలర్ వంగనూరు మురళీధర్‌రెడ్డి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఈవీ సుధాకర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ తలారి పుల్లయ్య, వద్ది బాలుడు ,సీతారామి రెడ్డి,పగిడాల దస్తగిరి, పల్లేటి చంద్రశేఖర్‌రెడ్డి, బద్వేల్ ప్రభాకర్‌రెడ్డి, బాబుల్ రెడ్డి, తమటం శ్రీనివాసులరెడ్డి, నాగేశ్వరరెడ్డి, బీజేపీ జిల్లాకార్యదర్శిక్రిష్ణ ప్రదీప్‌రెడ్డి, రాఘవేంద్రరెడ్డి, బోగా శివకల్యాణి తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగ ఉపాధి చంద్రబాబుతోనే సాధ్యం

ప్రొద్దుటూరు,ఏప్రిల్ 26 : రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగ యువతను ఘోరంగా వంచించిందని ఏటా జాబ్‌క్యాలెండర్ పేర మోసం చేసిందని యువతకు ఉద్యోగ ఉపాధి చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే సాధ్యమ ని మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మనుమరాళ్ళు చమేలి,శిల్ప, వసంత కోమల్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక 8వవార్డులో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థులైన నంద్యాల వరదరాజులరెడ్డిని ఎమ్మెల్యేగా ఎంపీ అభ్యర్థి గా భూపేష్‌రెడ్డి ని గెలిపించాలని ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈసందర్భంగా చంద్రబాబుతోను యువతకు ఉద్యోగ ఉపాధి అని ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో భూపేశ్‌రెడ్డి సతీమణి జ్యోతి, నేతలు నాగరాజు చెన్నయ్య, పరమేష్, రాజకులాయప్ప చీమల రాజశేకర్‌రెడ్డి బోగాల లక్ష్మీనారాయణమ్మ కానపల్లె సుబ్బరాయుడు పాల్గొన్నారు.

మహిళా అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యం



ప్రచారం చేస్తున్న టీడీపీ నేతలు

ప్రొద్దుటూరు,ఏప్రిల్ 26 : రాష్ట్రంలో మహిళల అభ్యున్నతి టీడీపీ తోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి కుమార్తెలు అనురాధ, అరుణ ,మనుమరాళ్ళు కోమల్ ,వసంత చమేలి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక 7 వవార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా టీడీపీ సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బోగాల లక్ష్మీనారాయణమ్మ, చీమల రాజశేకర్‌రెడ్డి గండ్లూరు వెంకట రమణ, సుబ్బరాయుడు, శంకర్‌రెడ్డి, చెన్నయ్య, రాజకులాయప్ప, టీఎన్ఎస్ఎఫ్ రాజేష్ పాల్గొన్నారు.

జిల్లాను అభివృద్ధిపథంలో నడిపిస్తాం

రాజుపాలెం, ఏప్రిల్ 26 : టీడీపీ అధికారంలోకి రాగానే జిల్లాను అభివృద్ధిపథంలో నడిపిస్తామని కడప పార్లమెంటు ఎంపీఅభ్యర్థి భూపేశ్ రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం టంగుటూరు గ్రామంలో ప్రొద్దుటూరు టీడీపీ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి, ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డిలను క్రేన్ సహాయంతో గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా భూపేశ్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి వరదరాజులరెడ్డి, ఎంపీ అభ్యర్థిగా తనను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీసభ్యులు తోట మహేశ్వర్‌రెడ్డి, నాయకులు మానుకింది ఖాదర్‌బాషా, కాకర్ల సంజీవరెడ్డి, కందుకూరి నడిపన్న, ధనిరెడ్డి వెంకటరెడ్డి, సుంకిరెడ్డి, వెంకట్రామిరెడ్డి, కొట్టాల జగన్ మోహన్ రెడ్డి,రామచంద్రరెడ్డి,గోనాపెద్దిరెడ్డి,ధనిరెడ్డి శివలింగారెడ్డి, చల్లా రాజగోపాల్ నాయకులు పాల్గొన్నారు.



వరదరాజులరెడ్డి, భూపేష్‌రెడ్డికి గజమాలతో స్వాగతం పలుకుతున్న నేతలు

జగన్ చెప్పేదొకటి...చేసేది మరొకటి

పుట్టా సుధాకర్‌యాదవ్ విస్తృత ప్రచారం.. పలువురు టీడీపీలో చేరికలు




ఖాజీపేట.. పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో చేరిన కోటంగురాయుపల్లె గ్రామస్థులు, మైదుకూరులో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు



ఖాజీపేట.. టీడీపీలో చేరుతున్న కొత్తపేట వాసులు

ఖాజీపేట, ఏప్రిల్ 26: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ ప్రజలకు చెప్పేదొకటి, చేసేది మరొకటి అని మైదుకూరు టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కోటంగురాయుపల్లెలో కోరా నాగిరెడ్డి, పద్మావతి, దీపిక, పోలురెడ్డి, నాగరత్న, సుబ్బిరెడ్డి అనుచర వర్గం, టీడీపీ మండలాధ్యక్షుడు లక్ష్మీరెడ్డి ఆధ్వర్యంలో 40 కుటుంబాలు , కొత్తపేట కంబాలగురివిరెడ్డి, గంటా చిన్నసుబ్బయ్య, కొత్త నెల్లూరులో మాజీ ఉపసర్పంచ్ లక్షుమయ్య, బాల ఓబులేసు, మాజీ ఎంపీటీసీ గంగమ్మ, వారి అనుచర వర్గం వాకమల్ల వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో దాదాపు 60 కుటుంబాలు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రెండు ఓట్లను తెలుగుదేశం పార్టీ సైకిల్‌గుర్తుకే వేయాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవి, మండల నాయకులు గోవిందురెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, వాకమల్ల వెంకటరామిరెడ్డి, టీడీపీ ఉపమండలాధ్యక్షుడు జిలానీ, ప్రతాప్‌రెడ్డి, సుబ్బయ్య, పూలసుల్తాన్, హబీబ్, ఖదీర్, డాక్టర్ హనీఫ్, మాబాష, శివారెడ్డి, కొత్తపేట శ్రీను, మామిళ్ల క్రిష్టారెడ్డి, సుబ్బిరెడ్డి, కొత్తపేట బుచ్చిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దువ్వూరు (మైదుకూరు)..: వైసీపీకి చెందిన మాజీ ఉప సర్పంచ్ టీడీపీలోకి చేరారు.దువ్వూరు మండలంలోని అన్నపుశాస్త్రీపల్లెలో శుక్రవారం సాయంత్రం టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ ఇంటింటి ప్రచారానికి రాగా ఆయన సమక్షంలో గ్రామానికి చెందిన ముదిరెడ్డి పెద్ద కొండారెడ్డి, మాజీ డీలరు వెంకట సుబ్బయ్య, నాయకులు గంగయ్య, కోనా వెంకట సుబ్బయ్య పెంచల్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి తదితరులకు చెందిన 20 కుటుంబాల వారు టీడీపీలోకి చేరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పుట్టా వెంట కదం తొక్కిన ముస్లిం మహిళలు

మైదుకూరు, ఏప్రిల్ 26 : టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ శుక్రవారం ఉదయం పట్టణంలోని 14వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించేందుకు రాగా స్థానిక ముస్లిం మహిళలు తామంతా మీ వెంటే అంటూ పెద్ద సంఖ్యలో పుట్టా వెంట తిరిగారు. వారే స్వయంగా టీడీపీ విడుదల చేసిన మేనిఫెస్టోకు సంబంధించిన కరపత్రాలు హుషారుగా పంపిణీ చేయడం ఓటర్లను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



మైదుకూరులో పుట్టాతో కలసి ప్రచారం చేస్తున్న ముస్లిం మహిళలు



బి.మఠంలో మహిళలకు టీడీపీ మేనిఫెస్టోను వివరిస్తున్న పుట్టా ఆనంద్‌యాదవ్

పలువురు టీడీపీలో చేరిక..: ఇంటింటి ప్రచారం చేస్తున్న టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్‌ను 14వ వార్డులో వైసీపీ నాయకులు జమాల్ వలి తన అనుచరులతో కలసి టీడీపీలో చేరారు.

ప్రచారానికి ప్రజలు బ్రహ్మరథం

బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 26 : మైదుకూరు నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్‌ను రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిపించాలని శుక్రవారం బ్రహ్మంగారిమఠం మండల కేంద్రం లోని వీరబ్రహ్మేంద్రనగర్, ప్రభునగర్, టౌన్‌లో ఎన్నికల ప్రచార సమన్వయ కర్త పుట్టా ఆనంద్‌యాదవ్ ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ ప్రచారంలో ప్రజలు బ్రహ్మరథం పట్టారు.ఈ కార్యక్ర మంలో మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, సీనియర్ టీడీపీ నేతలు శ్రీయపురెడ్డి శ్రీనివాసులరెడ్డి, ముడుమాల పోలిరెడ్డి, యల్లటూరు సాంబశివారెడ్డి, న్యాయవాది పట్టాభిరాముడు కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను ఆదరించండి




కొండాపురం పట్టణంలో ప్రచారం నిర్వహిస్తున్న దేవగుడి శివనారాయణరెడ్డి, పెద్దముడియంలో పార్టీలో చేరిన వారితో ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి

కొండాపురం, ఏప్రిల్ 26 : రాబోయే ఎన్నికల్లో ఎన్డీయే కూటమి తరఫున జమ్మలమడుగు ఎమ్మెల్యేగా ఆదినారాయణరెడ్డిని, కడప ఎంపీగా భూపేశ్‌రెడ్డిలను భారీ మెజారిటీతో గెలిపించాలని మండల బీజేపీ ఇన్‌చార్జి దేవగుడి శివనారాయణరెడ్డి కోరారు.కొండాపురం పట్టణంలో శుక్రవారం ఆయన ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు గండ్లూరు నాగేశ్వరరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి,బాబుల్‌రెడ్డి, గోరుశెట్టిబాబు, రమణారెడ్డి,ఇందిరమ్మ, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

పెద్దముడియం..: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి తరఫున నిలబడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డి విస్తృత ప్రచారం చేశారు. మండల పరిధిలోని చిన్నపసుపుల గ్రామంలో శుక్రవారం 15 కుటుంబాలు ఎన్‌డీఏ కూటమిలో చేరాయి. గ్రామానికి చెందిన కుమార్‌రెడ్డి, రాజారెడ్డి, మరికొంత మంది నాయకులు, కార్యకర్తలను కండువాలు కప్పి ఆది నారాయణరెడ్డి,భూపేష్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల..: రాబోయే ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం వస్తేనే అభివృద్ధి జరుగుతుందని జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి సతీమణి అరుణ పేర్కొన్నారు. శుక్రవారం ఎర్రగుంట్లనగరపంచాయతీలోని 10వవార్డులో ఆమె స్థానిక నాయకులతో కలిసి విస్తృతంగా ప్రచారం నిర్వమించారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీడీపీ ప్రభు త్వాలు వచ్చేందుకు ఎన్డీయే ఎమ్మెల్యే అభ్యర్థి సి.ఆదినారాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డిని అత్యధిక ఓట్లతో గెలిపించాలని అరుణ అభ్యర్థించారు. ఇంటింటికి కరపత్రాలు ఇస్తూ ఓటర్లను కలిచారు. ఈకార్యక్రమంలో సీతమ్మ, సంధ్యారాణి, రమాదేవి, జనసేన నాయకుడు జగదీష్, స్థానిక నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, మల్లుగోపాల్‌రెడ్డి, కత్తిప్రతాప్‌రెడ్డి, పెద్దఎత్తున మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కూటమి గెలుపుతోనే అభివృద్ధి సాధ్యం




బీకోడూరు, బద్వేలులో ప్రచారం నిర్వహిస్తున్న బొజ్జా రోశన్న

బి.కోడూరు, ఏప్రిల్ 26 : బద్వేలు నియోజకవర్గం కూటమి అభ్యర్థి బొజ్జ రోశన్నను కమలం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, యువ నాయకుడు రితీష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పెదుళ్లపల్లె గ్రామ పంచాయతీలో కూటమి అభ్యర్థి బొజ్జ రోశన్న, టీడీపీ మండల అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారనం నిర్వహించారు.మాజీ ఎమ్మెల్యే విజయమ్మ,రితీష్‌రెడ్డిలు మాట్లాడు తూ ప్రతి ఒక్కరూ కమలం గుర్తుపై ఓటు వేసి కూటమి అభ్యర్థి బొజ్జ రోశన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు విభాగ అధ్యక్షుడు ఓ.రమణారెడ్డి, బీజేపీ తాలుకా నాయకులు పెద్దిరెడ్డి సతీష్‌రెడ్డి, గోడి భాస్కర్‌రెడ్డి,అమర్‌నాథరెడ్డి,బీజేపీజిల్లాఉపాధ్యక్షుడురామసుబ్బారెడ్డి, జయరామి రెడ్డి, చౌదరి సుబ్బారెడ్డి , శేషారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, రాఘవరెడ్డి, దుగ్గిరెడ్డి, పవన్, పి.సుబ్బారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, బాలిరెడ్డి, రవిక్రిష్టారెడ్డి పాల్గొన్నారు.

కమలం గుర్తుకు ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించండి

బద్వేలు, ఏప్రిల్ 26: మున్సిపాలిటీ పరిధిలోని ఎగువ బ్రాహ్మణవీధి, దిగువ బ్రాహ్మణవీధిలో శుక్రవారం బొజ్జారోశన్న ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కమలం గుర్తుకు ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అలాగే కడప ఎంపీకి సైకిల్ గుర్తుకు ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో టీడీపీ నాయకురాలు అరుణమ్మ, జనసేన నాయకులు రమేష్, దద్దం వెంకటేశ్వర్లు, బీజేపీ, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: బద్వేలు నియోజకవర్గ కూటమి అభ్యర్థి బొజ్జ రోశన్న గెలుపు కోసం ఎన్నికల ప్రచారం చేశారు. శుక్రవారం పోరుమామిళ్లలోని కొత్తరామాయణపు వీధి మెయిన్‌రోడ్డు గుండా విస్తృత ప్రచారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అట్లూరు..: మండలంలోని మన్యంవారిపల్లె, పలు గ్రామాల్లో టీడీపీ నాయకులు బద్వేలు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి రోశన్నను గెలిపిద్దాం అంటూ కరపత్రాలను పంచుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డికి సైకిలు గుర్తుకు ఓటేయాలంటూ బీజేపీ, టీడీపీ ప్రవేశపెట్టిన పథకాలను వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు ఎం.మహేశ్వర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, జయరాంరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రఘునాథరెడ్డి, టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కాశినాయన..: బద్వేల్ అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి బొజ్జా రోశన్న కమలం గుర్తుకు ఓటేసి గెలిపించాలని శుక్రవారం టీడీపీ,బీజేపీ,జనసేన నాయకులు పిట్టిగుంట, ఓబుళాపురం గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు.ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు రోశయ్యగారి రాజశేఖర్ రెడ్డి,బోయిళ్ళ నరసింహారెడ్డి,మాజీ ఎంపీటీసీ రాజశేఖర్‌రెడ్డి,బోరెడ్డి అమర్‌నాథ్ రెడ్డి,వెంకటేశ్వర్లు,సింగరయ్య పెద్దిరెడ్డి కేశవ రెడ్డి, మాజీ డీలర్ బి.చెంచిరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు బి.నారాయణరెడ్డి, రాష్ట్రకార్యవర్గ సభ్యుడు మనోహర్‌రెడ్డి,బి.నారాయణరెడ్డి,కళ్యాణ్ రాజు, రామ్ ప్రసాద్‌రెడ్డి ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



బద్వేలులో వైసీపీ నాయకులకు కండువాకప్పి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న విజయమ్మ

చంద్రబాబుకు పట్టం కట్టేందుకు సంసిద్ధం

పోరుమామిళ్ల, ఏప్రిల్ 26 :చంద్రబాబుకు పట్టం కట్టేందుకు ప్రజలు సంసిద్ధమయ్యారని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధిలో ఎస్టీ కాలనీలో తుపాకుల ప్రసాద్ ఆధ్వర్యంలో 80 కుటుబాల వారు వైసీపీ నుంచి మాజీ ఎమ్మెల్యే విజయమ్మ సమక్షంలో టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జ రోశన్న, ఎంపీఅభ్యర్థి భూపేశ్‌రెడ్డిని గెలిపించాలన్నారు కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్లఉ పాల్గొన్నారు.

వైసీపీ పాలనకు చరమగీతంపాడాలి

బద్వేలుటౌన్, ఏప్రిల్ 26: : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి చరమగీతంపాడాలని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కోనసముద్రం పంచాయతీకి చెందిన వెలుగారిపల్లె, జోగురెడ్డిగారిపల్లె గ్రామానికి చెందిన 25వైసీపీ కుటుంబాలవారు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ ఆధ్వర్యంలో టీడీపీలో చేరాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామచంద్రారెడ్డి,రవికుమార్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, సాంబశివారెడ్డి, మల్లేశ్వరరెడ్డి, దానమయ్య, భాస్కర్, జయన్న, మనోహర్, జయరామ్, మాజీ సర్పంచ్ వెంకట సుబ్బయ్య, ప్రసాద్, రమేష్, శివ తదితరులు పాల్గొన్నారు.



పోరుమామిళ్ల ఎస్టీకాలనీలో విజయమ్మ సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన తుపాకుల ప్రసాద్ వర్గీయులు

ఎన్నికల ప్రక్రియ నిర్వహణలో లోపాలు ఉండరాదు

ఎన్నికల అబ్జర్వర్ భానుదాస్ పాల్వే

ప్రొద్దుటూరు,ఏప్రిల్ 26 : ఎన్నికల ప్రక్రియ నిర్వహణలో ఎలాంటి లోపాలు వుండరాదని ఎన్నికల అబ్జర్వర్ బానుదాస్‌పాల్వే సూచించారు. శుక్రవారం ప్రొద్దుటూరు ఆర్‌వో కార్యాలయంలో నోటీసు బోర్డులో ప్రదర్శించిన అభ్యర్థుల నామినేషన్ పత్రాలు అఫిడవిట్‌లను ఆయన పరిశీలించారు. అనంతరం అభ్యర్థులతో సమావేశమై ఎన్నికల నియమావళిని పాటించి ప్రశాంత ఎన్నికలకు అందరూ సహకరించాలని కోరారు. ఎన్నికల అధికారుల వైపు నుంచి ఎటువంటి సందేహాలు ఫిర్యాదులు వున్నా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం ఆర్‌వో కార్యాలయంలో పరిసరాలు, వసతుల ఏర్పాట్లను పరిశీలించారు.